# సమర్థ సద్గురు

## ఆధ్యాత్మిక మాసపత్రిక


శ్రీకాళీగార్డెన్స్ ఆశ్రమం - 522508, గుంటూరు జిల్లా

ఫోన్ (0863) 2293645, 2293862, 2293206.

web : www.mathaji-babuji.org samardhasadguru@rediffmail.com



**సంపాదక వర్గము**

మిస్. పి. ఇందిరాదేవి

డా॥ యమ్. స్వర్ణముఖి

సి.వి. రమణ బాబు

పి.యస్.ఆర్.కె. ప్రసాద్

కె. మురళీ మోహన వర్మ



సంపుటి 39 సంచిక 9

పేజీలు 44

మే 2020

5సం॥ల చందా రూ. 250

2సం॥ల చందా రూ. 120

సంవత్సర చందా రూ. 60

విడిప్రతి వెల...... రూ. 5

బ్యాంక్ డ్రాఫ్టు Y.S.C.K.P.M చారిటబుల్ ట్రస్ట్ , A/C సమర్థ సద్గురు ,పేరుతో డ్రా చేయండి. M.O, బ్యాంక్ డ్రాఫ్టు పంపవలసిన చిరునామా

మేనేజరు

సమర్థ సద్గురు మాగజైన్

శ్రీకాళీగార్డెన్స్ - 522508, నంబూరు

గుంటూరు జిల్లా

Printed and published by C.V. Ramana Babu on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh and Published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, Editor PALURI SIVA RAMA KALI PRASAD


**ఈ సంచికలో** ............................. ....... **పేజీ**


శ్రీకృష్ణ కర్ణామృతము ....................................4

శ్రీబాబూజీ ఉవాచ.......................................... 5

అమ్మమాట.................................................. 7

మాఘపూర్ణిమ విశిష్టత ....................................9

విశ్వంభరదాసు ...................... ...................... .......12

భీష్మని ఆరాధనలోని భావము................14

అహం బ్రహ్మాస్మి ................ ...............................15

శ్రీ సద్గురు వాణి .............................. .........................17

ఎవరు గొప్ప? ..................................... .......................19

త్రిగుణాలు ...................... ......................... .......... ....21

సాధనే ముక్తికి మార్గం ............ ....................25

గోదావరి స్నానాలు .. ......................................27

గుర్వష్టకమ్ .....................................................29

భజ గోవిన్దమ్ ...................................................31

శ్రీకాళీగార్డెన్స్ కార్యక్రమాలు.............................34

శత్రులు మిత్రులౌట..........................................35

కైవల్యోపనిషత్ ... ...........................................37

సమర్థ సద్గురునాధుని దివ్యచరిత్ర.....39

విష్ణు కథలు ...... ............................ ......................41

# శ్రీ కృష్ణ కర్ణామృతము

కీ.శే - సుశీలా ప్రసాద

**తృతీయాశ్వాసము - 34 వ శ్లో॥**

**ఏషు ప్రవాహేషు స ఏవ మన్యే**

**క్షణోఽ_ పి గణ్య పురుషాయు షేషు**

**ఆస్వాద్యతే యత్ర కయాపి భక్త్యా**

**నీలస్య బాలస్య నిజం చరిత్రమ్ ॥**

తాత్పర్యము -



ఈ ఎడతెగక జరుగుచున్నట్టి నరుల జీవిత కాలములలో ఏ క్షణమందు యిట్టిది అని నుడువ నశక్యమైన భక్తిచేత నీల వర్ణుడైన బాలకృష్ణుని యొక్క నిజ వృత్తాంతము సుఖముగా అనుభవింప బడుచున్నదో, ఆ క్షణమే లెక్కింపదగినది, సార్థకమైనది.

మానవుని జీవితకాలములో జన్మపరంపరల చేత ఎడతెగక జరుగుతున్నవి గాని ఇవన్నియు సార్థకములుగావు. భక్తితో శ్రీకృష్ణుని చరితము ఏ క్షణమందు సుఖముగా వినబడునో ఆ క్షణమే సార్థకమైనది.

---

*నిర్జీవుడైన బిడ్డను గంగార్పణం చేయగా పునర్జీవితుడై, మహాత్ముడైన వారెవరు?
*మహాత్ములు కొన్ని పనులు జరుగుతాయని చెప్పినా అవి జరగవెందుకు?
*గురుకృపాంజనం వలన కబీర్‌కు ఏమి లభించింది?
*సత్యం ఎన్ని రకాలు? అవి ఏవి?
*శంఖం బాలికగా మారి అవతరించిన అమ్మవారు ఎవరు?
*చూడటానికి, దర్శించడానికి వున్న తేడా ఏమిటి?
*భక్తుని తపన ఎలా వుండాలి?
*మనసు మీద వయస్సుకున్న అదుపును తప్పించాలంటే ఏం చేయాలి?
*సముద్ర స్నానం దేనికి దోహదం చేస్తుంది?

*సమాధానాలు లోపలి పేజీలలో..........................*

# శ్రీబాబూజీ ఉవాచ

- కీ.శే. పరాశర ప్రసాద్

25-3-1980

ఈరోజు రాత్రి సుమారు 8గంటలకు శ్రీ బాబు భక్తులందరికి దర్శనం యిచ్చారు. డాక్టరు ప్రసాదరావుగారు శ్రీరామనవమికి రావటానికి వీలుండదని వ్రాసిన ఉత్తరం ప్రసక్తి వెంకటరత్నంగారు తీసుకు వచ్చినపుడు, శ్రీబాబూజీ దానికి సమాధానం చెపుతూ "ఆయన అలా వుత్తరం వ్రాసినా తప్పకవస్తారు" అన్న విషయాన్ని గుర్తుచేస్తూ, మీరు చెప్పినట్లు ప్రసాదరావుగారు నవమికి వచ్చారు అని రత్నంగారు అన్నారు. మీరు చెప్పినట్లు వస్తారా, రారా అని మేము ఎదురు చూస్తున్నాము అన్నారు రత్నంగారు.



శ్రీ బాబు మాట్లాడుతూ "ఆ విధమైన భావంతో గురుదేవులను పరీక్ష చేయటం తప్పు. మహాత్ములు కొన్ని సందర్భాలలో భక్తులను పరీక్షించే నిమిత్తం కొన్ని అడ్డంకులను కల్పిస్తారు. కొన్ని పనులు జరుగుతాయి అని చెప్పినా జరగవు. కొన్ని జరుగుతాయి. భక్తుల విశ్వాసాన్ని పరీక్షించేందుకు ఇవన్నీ జరుగుతాయి.

విశ్వాసము చాల ముఖ్యము. ఏ విధమైన సంకల్పమూ వుండరాదు. మనం నిదురించాలి అన్న భావనకన్న, నిదురించటమే ముఖ్యం. ఆత్మ దర్శనం పొందినవాడికి, మనం స్వర్గం చేరుకోవాలి అనే భావనకూడా ఉండదు. ఆ భావన దానిలో లయించిపోతుంది. బ్రహ్మతత్వాన్ని తెలుసుకొన్న జ్ఞాని, తన జ్ఞాన సంపదను స్వార్థరహితంగా అందరకు పంచిపెడతాడు. ఆ విద్య పరమపదాన్ని చేరుకోవడానికి తోడ్పడుతుంది.

బుద్ధ భగవానుడు ఎన్నోవేలమందిని జ్ఞానమార్గంలో

నడిపించాడు. ఆయన కీర్తి సంపద ఎంత కాలమైనా తరుగుతుందా? జ్ఞాని ముక్తి కాంత ఒడిలో, ఆనందాన్ని అనుభవిస్తూ అసంప్రజ్ఞ స్థితిలో ఉంటాడు.

సంసారాన్ని సరిదిద్దుకుంటూ ఉండే వారిలో అనేకమంది జ్ఞానులు ఉంటారు. మనలో ఉన్న ఆత్మతేజస్సును తెలుసుకొనగల్గటమే దివ్యజ్ఞానము. ఆ ఆత్మ తేజస్సే పరమాత్మ. దానికి చావు, పుట్టుక, భయము లేవు. దానికి బాల్యం, యౌవనం, కౌమారం మొదలైన దశలు లేవు.

శ్రీ శంకర భగవత్పాదులవారు శ్రీ కాశీ విశ్వేశ్వరుడిని దర్శించి ఆయనకు కోతిని బహుకరించి స్వామీ, 'మీరు భవతీ భిక్షాందేహి! అని భిక్షాటనకు వెళ్ళునపుడు ఇది మీకు ఉపకరిస్తుంది. దీనిని మీరు స్వీకరించి నాకు కావలసింది ప్రసాదించండి ప్రభూ!' అంటారు.

ఆ విశ్వేశ్వరునికి తెలుసు అద్వైతాన్ని బోధించగల ఆచార్యుడు శ్రీ శంకర భగవత్పాదుల వారొక్కరేనని. కాబట్టి ఆయన కోరినదాన్ని ప్రసాదిస్తాడు. బ్రహ్మతత్వ విచారణ చేసేటపుడు, నిత్యకర్మని చేయరాదని ఎవరూ అనరు. కర్మని నిర్వహించవచ్చు. భక్తియొక్క పరాకాష్ఠయే జ్ఞానము. భగవన్నామములో ఎంత రుచి లేకపోతే భక్తి పారవశ్యంలో శ్రీ గోరాకుంభారు పుత్రుడిని త్రొక్కివేస్తాడు?" అన్నారు.



# అమ్మమాట - రమణ ప్రసాద్

## వ్యష్టి - సమష్టి

శ్రీ గురుదేవులు వికారి నామ సంవత్సరంలో మనలో వున్న వికారాలను తొలగించి మనలను సన్మార్గంలో నడిపించారు. వారు అపర దక్షిణామూర్తులే. ఈశ్వర కృపను పొందటానికి వెళ్ళిన సనకసనందనాదులను అనుగ్రహించడానికి సాక్షాత్ ఈశ్వరుడే ధ్యాననిష్టలో కూర్చుని వారిని అనుగ్రహించాడు. శ్రీగురుదేవులు ఇక్కడ ఉన్న మనందరినీ అనుగ్రహిస్తున్నారు. **'ప్రసాదే సర్వదుఃఖానాం, హాని రస్యోపజాయతే'** మనస్సునకు నిర్మలత్వం ప్రసాదించి మనశ్శాంతిని ప్రసాదిస్తున్నారు. వారిది అనుగ్రహదృష్టి. పూర్వ వాసనల వలన నీ దృష్టి నిన్ను మోసం చేస్తోంది. వివేక బుద్ధితో విచారణ చేసి మధుర దృష్టిలోకి వెళ్తే మూర్తిలో అమూర్త్యత్వాన్ని పొందగలవు. అది సమష్టి భావం. వ్యష్టి దృష్టిలో భగవంతుణ్ణి బంధిస్తున్నావు.



అమూర్త్యత్వం అందరిలో వుండి అన్నిటినీ ప్రకాశింపచేస్తోంది. వారిది సర్వ వ్యాపకత్వం.

***ఎవ్వనిచే జనించు జగమెవ్వనిలోపలనుండులీనమై***
***ఎవ్వనియందు డిందు పరమేశ్వరుడెవ్వడు మూలకారణం***
***బెవ్వడనాది మధ్యలయుడెవ్వడు సర్వముదానయైన వా***
***డెవ్వడు వాని నాత్మభవు నీశ్వరునే శరణంబు వేడెదన్ -***

అని గజేంద్రుడు ప్రార్థించాడు. ఏ దేవుడిని ప్రార్థించాడు? ఆ స్థితిలో పిలిస్తేనే భగవంతుడు నారాయణమూర్తి రూపంలో వచ్చి రక్షించాడు. నా గురుదేవుడు సర్వ వ్యాపకుడు అనే భావన మనకు రావాలి. భక్తి ప్రధానం. అనవసరమైనవాటిని త్యజించే త్యాగ బుద్ధి రావాలి. ప్రపంచంలో ఉండు. కాని ప్రపంచాన్ని నీలోకి రానీయకు. ప్రపంచంలోని దోషాలను గుర్తించి వాటిని మన దరికి రానీయకూడదు. అంతటా భగవంతుడిని చూడగలగాలి.

*గురు కృపాంజన్ పాయో మొరె భాయో*
*రామ్ బినా కఛు జానత్ నాహీ ।*

కబీరు తన లోపల, బయట, అంతటా రాముడినే దర్శించాడు. మూడు అవస్థలలో రాముడినే దర్శించాడు. అది గురు కృప అనే అంజనం వల్ల తనకు కలిగిందని శ్లాఘించాడు.

నీ మరపుకు మరుగులేనిదేదైతే ఉన్నదో అది భగవంతుడై వున్నాడు. అటువంటి గురుదేవుల కృపను కలిగే ఉన్నామన్న గుర్తింపు రావాలి. దేవుడింతవరకే ఉన్నాడనేది వ్యష్టి దృష్టి. ఆయన స్వయంగా ప్రకాశిస్తూ అంతటా ప్రకాశింప చేస్తున్నారు అనేది సమష్టి దృష్టి. అట్టి దృష్టిని మనం అలవరచుకోవాలి. ధ్యానం ద్వారా జ్ఞానం. జ్ఞానానికి పరాకాష్ఠ మోక్షం. అది బ్రతికి ఉండగానే పొందాలి. అట్టి జీవన్ముక్త స్థితిని శ్రీగురుదేవులు ప్రసాదించెదరు గాక సుఖీభవ!

## భక్తులకు విన్నపము

శ్రీ సద్గురునాధుని దివ్య చరిత్ర ఇప్పటికి 2 భాగములు -1వ భాగం 2005లోను, 2వ భాగం 2011లోను వెలువడినవి. వీటిని శ్రీ విజయేశ్వరానంద ప్రసాద్ వారు గ్రంథస్థం చేశారు. ఇప్పుడు మనం 2020 సంవత్సరంలో ఉన్నాం. గడచిన ఈ 16 ఏళ్ళకాలంలో శ్రీగురుదేవులు, గురుస్థానంలో విరాజిల్లుతున్న "అమ్మ" తమ కృపా కటాక్షాలను మనందరిపై వెదజల్లి మనలను సంరక్షిస్తున్నారు. బాబూజీ అవతార సమయంలో, అమ్మ రక్షణలో భక్తులు పొందిన దివ్యానుభవాలను ఆధ్యాత్మికతతో జోడించి పోస్ట్‌లోగాని, email లోగాని, ramuchitti@yahoo.com/ cvrbabu41@gmail.com కి ముందుగా పంపండి. ఆ తరువాత మాకు వాటి పూర్తి వివరణను ఇస్తే, ప్రచురణార్హమైనవి, అమ్మ అనుజ్ఞతో "శ్రీ సద్గురునాధుని దివ్య చరిత్ర" (3వ భాగం) గా ప్రచురణ చేయటం జరుగుతుంది. కావున భక్తులు గమనించి అమ్మ తలపెట్టిన "గురుకార్యా"న్ని విజయవంతం చేయమని ప్రార్థిస్తున్నాము.

# మాఘ పూర్ణిమ విశిష్టత

- సుషుమ్నా ప్రసాద

మాఘ పూర్ణిమ పవిత్రమైన రోజు. మాఘ పూర్ణిమ పవిత్రమైన గురుపూర్ణిమ లేదా వ్యాసపూర్ణిమగా వినుతికెక్కింది. కాలమనేది అమూల్యమైనది, ఆద్యంతములు లేనిది. మానవుడు తన సౌలభ్యం కోసం సంవత్సరాలుగా విభజించుకున్నాడు. ఒక సంవత్సరానికి పన్నెండు మాసములుగా, ఒక మాసమునకు నాలుగు వారములుగా, వారాన్ని ఏడు రోజులుగా, రోజుకు 24గంటలుగా పరిగణింపబడుతుంది. భగవత్సేవకు వినియోగించే ప్రతిరోజు శ్రేష్ఠమైనప్పటికి, అందులో కొన్నిరోజులకు ప్రత్యేక ప్రతిపత్తి వున్నది. పన్నెండు మాసాలలో ప్రతి మాసానికి ఒక పూర్ణిమ, ఒక అమావాస్య వున్నది. పూర్ణచంద్రోదయమయ్యే ఈ 12 పూర్ణిమలలో 4 పూర్ణిమలకు ప్రత్యేకత వున్నది. వాటిని ఆ, కా, మా, వై అని క్లుప్తంగా పేర్కొంటాము. అవే ఆషాఢ పూర్ణిమ, కార్తీక పూర్ణిమ, మాఘ పూర్ణిమ, వైశాఖ పూర్ణిమ అని నాలుగు పూర్ణిమలను గురుపూర్ణిమలుగా పరిగణిస్తాము.

మాఘమాసాన్ని మహామాఘి అని కూడా సంబోధిస్తారు. మాసాలలో ఘనమైనది కాబట్టి మాఘమాసం అంటారు. మఖ నక్షత్రంలో వచ్చే మాసం కాబట్టి మాఘమాసమైనది. అలాగే మానవుడి ఘనమైన ఆధ్యాత్మిక పురోగతికి దోహదం చేసే మాసం కాబట్టి మాఘమాసం అయింది. మాఘమాసానికి పౌరాణిక ప్రతిపత్తి కూడా వున్నది. 'మఖం' అంటే యజ్ఞం అని కూడా అర్థం వున్నది. ఈ మాసం సనాతన సంస్కృతిని వుద్దీపనం చేయడానికి దోహదం చేసేది. యజ్ఞ యాగాదులకు ఇంద్రుడు అధిపతి. ఇంద్రాధిపత్యము వహిస్తున్న మాసం కాబట్టి ఇది మాఘ మాసం అయింది. మాఘం అంటే మరో అర్థం కూడా వున్నది. 'అఘం' అంటే పాపం. 'మా' అంటే వద్దు అని. పాపము చేయవద్దని నిర్దేశించే మాసం కాబట్టి 'మాఘ' మాసం. పద్మ పురాణంలో కూడా మాఘమాసం యొక్క ధార్మిక క్రియలను అభివర్ణించారు.

మాఘ మాసం ఆధ్యాత్మిక సాధనకు దోహదం చేసే మాసము. సూర్యభగవానుడు ఉత్తరాయణంలో ప్రవేశించి, నులివెచ్చని కిరణాలతో శీతలానికి తిలోదకాలిస్తాడు. శీతోష్ణములు సమతుల్యంగా వుండి, ఆధ్యాత్మిక సాధనకు చక్కగా దోహదం చేస్తాయి. ప్రకృతి చిత్ర విచిత్ర

శోభతో విరాజిల్లుతుంటుంది. చల్లని వెన్నెల రేడు షోడశ కాంతులతో శోభిల్లే చల్లని రాత్రి మాఘ పూర్ణిమ. షోడశ కళలతో చంద్రుడు ప్రకాశిస్తాడు కాబట్టి మాఘ పూర్ణిమను 'మహా మాఘి' అని కూడా పిలుస్తారు. జ్యోతిష్య శాస్త్ర రీత్య కూడా మఖ నక్షత్రానికి బృహస్పతి అధిపతి. బృహస్పతి బుద్ధికారకుడు. చంద్రుడు మనసును ప్రభావితం చేస్తాడు. మనో బుద్ధులను వికసింపజేస్తూ మానవుని ఆధ్యాత్మిక పురోగతికి చేయవలసిన కృషి, సాధనలకెంతో ఉపయుక్తమైనది.

ఈ మాఘ పౌర్ణమికి శైవ, శాక్తేయ, వైష్ణవ సంప్రదాయాలలో ప్రత్యేక స్థానమున్నది. 'శివు'ని శ్రేష్ఠతను, 'మాధవు'ని మహిమను, 'శక్తి' సామర్థ్యాన్ని చక్కగా తెలియజేసే మాసము. అంతేకాక, ప్రత్యక్ష పరమాత్మయైన సూర్య నారాయణ మూర్తి వైభవమును తెలియజేసే మాసము. మహాశివరాత్రి కూడా ఈ మాఘమాసంలోనే రావడం విశేషం. మాఘపూర్ణిమ నాడు సముద్ర స్నానం చాలా ప్రాముఖ్యమైనది. ఈ సముద్రస్నానం మనస్సు అనే సాగరంలో వుండే అనంత కెరటాల వంటి సంకల్పాలను రహితం చేసి, స్థిమితత్వమును కలుగజేయడానికి దోహదం చేస్తుంది. మనసు అంటేనే మాయ. 'మాయ' అంటే ఏది లేదో అది వున్నట్లు భ్రమింపజేసేది. మనస్సును నిగ్రహిస్తే మాయకు వీడ్కోలు చెప్పినట్లే. మనసు నిగ్రహించడానికి చేసే సాధనకు మాఘ మాసం ఎంతో ఉపకరిస్తుంది. పవిత్రమైన జలస్నానమంటే కేవలం బాహ్య స్నానం మాత్రమే కాదు. స్నానం మనోమల త్యాగం. శౌచం ఇంద్రియ నిగ్రహః - అని స్కందోపనిషత్ చెబుతోంది. త్రికరణ శుద్ధిగా చేసే మాఘ స్నానం మనో మాలిన్యమును రహితం చేస్తుంది.

మాఘ పూర్ణిమ ఆదిత్యునకు ప్రియమైనది. ఆదివారం నాడు వస్తే మరీ విశేషమంటారు. ఈ వికారి నామ సంవత్సరంలో మాఘపూర్ణిమ ఆదివారం నాడు రావటం విశేషం. 'మహామాఘి'నాడు పవిత్రమైన సముద్ర స్నానం నదీ స్నానం చేయడం వలన ఈ జలములకు అధిష్ఠాన దేవతయైన భవుడి అనుగ్రహం దక్కుతుందని 'శతరుద్ర సంహిత' పేర్కొంది. కనుకనే భవ్యమైన, దివ్యమైన మాసంగా పేర్కొంటాము. పరమ శివుని అష్టమూర్తులలో భవుడు జలాధిపతి. అందుకే శంకరుడిని జలేశ్వరుడిగా శివసహస్ర నామం కీర్తించింది. జీవుల సకల కల్మషాలను శుద్ధి చేస్తూ, పంచ భూతాలలో భవుడు

ప్రాణశక్తిగా వెలుగొందుతున్నాడు. ఈ పవిత్రమైన జలస్నానం కేవలం బాహ్యమైనది కాదు. ఇది అంతర్గతమైనది. మనలోని ఆలోచనలను, అంతరంగాన్ని క్షాళనము చేసి, నిర్మలత్వాన్ని ప్రసాదించే ఆంతరంగిక స్నానముగా మలచుకోవాలి. అప్పుడు మాయ మనదరికి చేరదు. మనలో వుండే పంచ కోశాలను, పంచప్రాణాలను, పంచేంద్రియాలను పవిత్రీకృతం చేయడానికి ఈ పవిత్ర స్నానాలు ఉపయుక్తమవుతాయి. మరొక కథనం కుడా వున్నది. ఈ పవిత్రమైన మాఘ పౌర్ణమినాడు పరమేశ్వరుని అర్థాంగియైన సతీదేవి జన్మించింది. దక్షప్రజాపతి 'మహామాఘి'నాడు ఒక నదిలో స్నానమాచరిస్తుండగా పద్మంలో ఒక శంఖం లభించింది. ఆ శంఖం దక్షుని కరస్పర్శతో ఒక బాలికగా మారింది అని చెబుతారు. ఆమెయే సతీదేవి. ఆ సతీదేవియే మహేశ్వరుని ఇల్లాలయింది. అందుకే మాఘపూర్ణిమను 'శంఖపూర్ణిమ' అని కూడా అంటాము.

ఈ పవిత్ర మాఘపూర్ణిమ నాడే జగద్గురువైన ఆదిశంకరాచార్యులవారు పంచాయతన పూజావిధిని ప్రారంభించారు. ఈ మాఘ పూర్ణిమను షట్తిల పౌర్ణమిగా కూడా పరిగణిస్తారు. తిలలు కలసిన జలంతో స్నానం చేసి, తిలాహోమం, తిలార్చనము, తిలాదానము, తిలానివేదన, తిలాభక్షణమనే ఆరు ప్రక్రియలను మాఘ పౌర్ణమి నాడు పాటిస్తే, ఆరోగ్య వృద్ధి చేకూరుతుందని వైద్యరత్నాకరంలో చెప్పారు. పవిత్రమైన 'విష్ణు సహస్ర నామ' స్తోత్రం యుధిష్టిరునకు భీష్మాచార్యులవారు ప్రబోధించింది కూడా ఈ మాఘ మాసంలోనే. అంతేకాక, భీష్మాచార్యుల వారి అస్తమయం కూడా ఈ మాఘమాసంలోనే జరిగింది. మాయ అనే 'మహమ్మారి' బారిన పడకుండా నిరంతర భగవన్నామ స్మరణ, సాధనలలో మనస్సును మాధవుని యందు లేక మహేశ్వరుని (శివకేశవులకు భేదం లేదు) యందు లగ్నం చేయాలి. అలా గురు పరమాత్మయందు మనస్సును లగ్నం చేసి, మనస్సును (మాయను) జయించిన ఆధ్యాత్మిక సాధకుడు (గురు పుత్రుడుకు) సద్గురుదేవుని కటాక్షమునకు సంపూర్ణంగా పాత్రుడౌతాడు. అదే నిజమైన మాఘపూర్ణిమ. అలా మాయను సంపూర్ణంగా జయించిన గురుపుత్రునకు నిత్యమూ 'మాఘ పూర్ణిమ' పర్వదినమేనని భగవాన్ శ్రీకాళీప్రసాద్ బాబూజీ ప్రబోధించారు.

# విశ్వంభరదాసు

సేకరణ - కె. మురళి

కాశీలో మాధవస్వామి అనే బ్రాహ్మణుడికి కలిగిన ఏడుగురు సంతానం విగతజీవులుగానే జన్మించారు. వారిని గంగార్పణం చేసి, విచారంగా కాలం గడుపుతూ వుండగా రోహిణీ నక్షత్రంలో జన్మించిన అష్టమ పుత్రుడు కూడా నిర్జీవుడే. ఆ బిడ్డను కూడా గంగార్పణం చేయగా, కొంత దూరంలో సూర్యభగవానునికి అర్ఘ్యం అర్పిస్తున్న శ్రీ రఘునాధ శర్మకు తగుల్కొని నిలిచిపోయింది. శర్మగారు పసికందుని ఎత్తుకొని చూడగా కనులు తెరిచి ఏడవటం మొదలుపెట్టాడు. ఇంటికి తీసుకెళ్ళి భార్యకు అందించి, శ్రీరామ విశ్వంభరదాసు అని నామకరణం చేశాడు. ఈ సంఘటన శ్రీకృష్ణుని జననాన్ని గుర్తుకు తెస్తోంది. రఘునాధ శర్మ గొప్ప పండితుడు, ఆధ్యాత్మిక విద్యా కోవిదుడు, నిష్ఠాగరిష్ఠుడు. విశ్వంభర దాసుకు తానే స్వయంగా సమస్త విద్యలు నేర్పించాడు. దాసు తీవ్ర సాధన చేసి యోగసిద్ధుడైనాడు.

విశ్వంభరదాసు తల్లిదండ్రుల వద్ద శలవుతీసుకుని దేశ సంచారానికి వెళ్ళారు. ఎక్కడెక్కడ తపస్సు చేశారో కానీ పంజాబు, ఉత్తర ప్రదేశ్, ఒరిస్సాల మీదుగా పయనించి వారి మనస్సుకు ఆహ్లాదం కలిగించిన సింహాచలంలో (1840) స్థిర నివాసం ఏర్పరచుకున్నారు. సుమారు 12సం॥ నిరాహారంగా తపస్సు చేశారు. చాలా కాలం పండ్లు ఆకులు మాత్రమే తిన్నారు. అనంతర కాలంలో భక్తులు సమర్పించిన పాలు త్రాగేవారు. వారు ఎక్కువ కాలం మౌనంగానే వుండేవారు. ఎప్పుడో తనకిష్టమైతే మాట్లాడేవారు. విశాఖపట్నం పరిసరాలలోని అనేకమంది భక్తులు వీరిని ఆశ్రయించి ఈతి బాధల నుండి విముక్తిని పొందితే, మరికొంతమంది ఆధ్యాత్మిక శిఖరాలను అందుకున్నారు. ఆ ప్రాంతంలో సుమారు అయిదు తరాలవారు స్వామి దర్శన భాగ్యాన్ని పొందారని చెప్తారు.

శ్రీ విశ్వంభర దాసుగారు నిత్యం గాయత్రీ హోమం చేసి, ఆ హోమ కుండంలోని భస్మం ఆర్తులకు, జిజ్ఞాసువులకు ప్రసాదంగా యిచ్చేవారు. విశాఖపట్నం ప్రాంతీయులేకాక అనేక దూర తీరాల నుండి భక్తులు స్వామి దర్శనం, అనుగ్రహం కొరకు వచ్చేవారు. స్వామి భక్తుల

భవరోగాలను, దీర్ఘరోగాలను నయం చేసేవారు. ఏళ్ళ కొలదీ యోగ నిష్ఠలో వుండి తపస్సంపన్నులైనందు వలననేమో వారు వందల సంవత్సరాలు జీవించి, సాటి మానవులను ఆదుకొని, సన్మార్గంలో నడిపించారు. వీరి ఆశ్రమం గాయత్రి ఆశ్రమంగా పేరుగాంచింది. వీరిని భక్తులు గాయత్రీ బాబా అని కూడా పిలిచేవారు. స్వామి ప్రచారానికి అంగీకరించేవారు కాదు. అనేకమంది పత్రికా విలేఖరులు, భక్తులు స్వామి గురించి వార్తా పత్రికలలో వ్రాయడానికి ప్రయత్నించగా, స్వామి అంగీకరించలేదు.

స్వామి సుమారు 443 సం॥ జీవించారని చరిత్రకారుల అంచనా. మన ఆంధ్ర రాష్ట్రం చేసుకున్న పుణ్యం వలన స్వామి తమ చరమ జీవితం 150 సం॥ సింహాచల క్షేత్రంలో గడిపి ఎందరో శిష్యులను, భక్తులను ఆదుకొని, భక్తి జ్ఞాన వైరాగ్యాలను బోధించి తరింపజేశారు. వారు 5-6-1993 శనివారం పగలు 11-12 గం. మధ్య తమ భౌతిక కాయాన్ని త్యజించారు. భక్తులు వారు తపస్సు చేసిన గుహ పైభాగాన సమాధి నిర్మించి దానిపై శివాలయం నిర్మించారు. ఇవి రెండు ఈ నాటికి యాత్రికులందరికీ దర్శనీయ స్థలాలు.

## సమర్థ సద్గురు మాస పత్రిక సభ్యులకు విజ్ఞప్తి

ఈ క్రింద తెలిపిన సభ్యుల మాస పత్రిక చందా మే, జూన్ 2020 మాసాలలో ముగుస్తుంది. పత్రిక నిలిపివేసే ముందుగా మీ సభ్యత్వాన్ని పునరుద్ధరించుకొనండి.

***మే 2020:*** AS 4696, 6069, 7069, 7124, 7127, 7775, 8037, 8039 నుండి 8055, 8058 నుండి 8135, 8137.

***జూన్ 2020:*** AS 6465, 7130, 7133, 7387, 7781.

# భీష్ముని ఆరాధనలోని భావము

- గాలి జగదీశ్

మహాత్ముడైన భీష్ముని మరణకాలము మాధవ దర్శనముతో మంగళకరముగ మారుతుంది. పరమాత్మను దర్శిస్తూ ప్రాణాలను విడిచి పెట్టాలని భీష్ముడు సంకల్పించడం చేత, దానిని నిజం చేయడానికి నిరంజనుడు అరుదెంచాడు.

భీష్మ యుధిష్ఠిర సంవాద ఫలితంగా మనకు విష్ణు సహస్రనామ స్తోత్రం లభించింది. వినడానికి ధర్మరాజు అధికారి అయ్యాడు. మహాభారత యుద్ధంలో ఏ విధమైన అస్త్రశస్త్రములు ధరించనని శ్రీకృష్ణుడు ప్రతిజ్ఞ చేశాడు. యుద్ధంలో భీష్ముని బాణముల తాకిడికి అర్జునుడు తీవ్రంగా కలత చెందాడు. అది చూసిన కృష్ణ పరమాత్మ రథం నుండి క్రిందకు దూకి, చక్రాన్ని చేబట్టి, ఏనుగు మీదకు దూకుతున్న సింహం వలె పరుగెత్తాడు. ఆ దివ్య రూపాన్ని గాంచిన భీష్ముడు పరవశించాడు. తన జన్మ ధన్యమైనదని భావించాడు.

భక్తుడైన అర్జునునకు విజయాన్ని చేకూర్చడానికి తన ప్రతిజ్ఞను వమ్ము చేసుకోవడానికి కూడా భగవంతుడు వెనుకాడలేదు. తాను అపకీర్తిపాలైనా తన భక్తులకు జయం కలగాలని భావించాడు. భక్తునిపై భగవంతునికి వున్న ప్రేమను చూసి భీష్ముడు పులకాంకితుడయ్యాడు.

భీష్ముడు అంపశయ్యపై వున్నప్పుడు శ్యామసుందరుడు భీష్ముని ఇలా ప్రశ్నించాడు 'భీష్మ పితామహా! నీవు ధర్మాత్ముడవు! ధర్మజ్ఞుడవు! అధర్మపరులైన దుర్యోధనాదులవైపు నిలబడి పోరాడటం నీకు తగునా?' దానికి భీష్ముడు 'కృష్ణా! కౌరవుల ఉప్పు తిన్న కారణంగా నా దేహం వారివైపు నిలబడి వుందిగానీ, నా మనస్సు అంతా పాండవులవైపే వుంది. నీవు పార్థ సారథివి కదా, నేను కౌరవుల పక్షాన వుండకపోతే ఎదురుగా నిలబడి నీ దివ్యరూపాన్ని దర్శించే భాగ్యము నాకు సంప్రాప్తించేదా?' అని భీష్ముడు ఎదురు ప్రశ్న వేశాడు.

ఎంత చక్కటి భావన! సదా పరమాత్మనే దర్శించాలనే కోరిక! ఆ మహాత్ముని హృదయ సౌందర్యాన్ని ఎవరు వర్ణించగలరు? భీష్మపితామహుని జీవితం సర్వులకు ఆదర్శనీయం! స్ఫూర్తిదాయకం!!

# అహం బ్రహ్మాఽస్మి

సేకరణ - బొంబాయి కృష్ణారావు

ఈ సృష్టి మొత్తం వ్యాపించి వుండి, దాని ఉత్పత్తి, పెంపు, లయములకు ఎవరు కారణమవుతున్నారో అతనినే 'దేవుడు' అని అన్నారు మన ఋషులు. మరి ఆ దేవుడు మన కళ్లకు ఎందుకు కనబడడు అనే సందేహం మనలో చాలా మందికి కలుగవచ్చు. నిజాన్ని పరిశీలిస్తే పాంచభౌతికమైన మన శరీర అవయవాలకు వున్న శక్తి చాలా పరిమితం. ఉదాహరణకు మన కాళ్ళు ఈ విశ్వాన్ని మొత్తం నడిచి రాలేవు. వాటికి అంత శక్తి లేదు. మన చేతులు కైలాస పర్వతాన్ని ఎత్తి పట్టుకుని మోయలేవు. వాటికి అంత శక్తి లేదు. మన కళ్ళు అతి విస్తృతమైన పదార్థాన్ని కానీ, అతి సూక్ష్మమైన పదార్థాన్ని కానీ చూడలేవు. వాటికి అంత శక్తి లేదు.

ఆకాశం మన కంటికి కనిపించదు. చూస్తున్నామని అనుకోవడం మన భ్రమ. అతి సూక్ష్మ క్రిమి అయిన 'అమీబా'ని సూక్ష్మ దర్శిని (మైక్రోస్కోప్) సాయంతో చూస్తున్నాం కదా అని మీరు అడగవచ్చు. మన కళ్లకు అంత శక్తి లేదు కనుకనే మనం సూక్ష్మ దర్శినిని ఆశ్రయించవలసి వస్తుంది. మరి ఈ కళ్లతో 'దేవుని' చూసిన ఋషులు వున్నారు కదా అని మీరు అడుగవచ్చు. కళ్ళు భౌతికమైన పదార్థాలను మాత్రమే చూడగలవు. మనో నేత్రం అభౌతికమైన పదార్థాలను దర్శిస్తుంది. 'దేవుడు' మనో నేత్రానికి దర్శనమిస్తాడు. తను సంకల్పించిన అప్పుడు మాత్రం మన భౌతిక నేత్రాల ముందు ప్రత్యక్షమవుతాడు. చూడటానికి, దర్శించడానికి వున్న తేడా అది.

మరి మనో నేత్రంతో 'దేవుని' దర్శించడం ఎలా? అన్నదే ఈ నాటి మన ప్రశ్న. పంచభూతాల శక్తుల సమ్మిళితమే భూలోక జీవుల శరీర నిర్మాణం. అందుకే ఈ లోకంలోని జీవులన్నీ భూమిని ఆశ్రయించి జీవిస్తుంటాయి. పంచభూతాల తత్త్వాలు మన శరీరాన్ని ఆవహించి వున్నంత వరకూ వాటికి అతీతంగా వుండే పరమాత్మ మన కళ్లకు దర్శనం ఇవ్వడు. ఆ దేవదేవుని దర్శించాలంటే పంచభూత తత్త్వాలను, వాటి గుణాలను త్యజించాలి. ఏమిటి వాటి గుణాలు, తత్త్వాలు అంటే?

ఆకాశానికి వున్న ఒకే ఒక గుణం - శబ్దం. వాయువుకున్న గుణాలు రెండు - శబ్దము, స్పర్శ. అగ్నికి వున్న గుణాలు మూడు - శబ్ద, స్పర్శ, రూపములు. జలముకు వున్న గుణాలు నాలుగు - శబ్ద, స్పర్శ, రూప, రసము(రుచి)లు. భూమికి వున్న గుణాలు అయిదు - శబ్ద, స్పర్శ, రూప, రస, గంధములు.

ఈ అయిదు గుణాలు పాంచభౌతిక తత్త్వంగల మన శరీరానికి వున్నాయి కనుకనే మనం భూమిని ఆశ్రయించి జీవిస్తున్నాము. జలము గంధము అనే గుణాన్ని త్యాగం చేయడం వలన మనం నీటిని చేత్తో పట్టుకోలేము. నీటికి మన చేతిని ఆధారంగా మాత్రమే వుంచగలం. కొంతసేపటికి ఆ నీరు ఆవిరైపోతుందేగానీ మనం బంధించలేము. అగ్ని రస, గంధములనే గుణాలను త్యాగం చేయడం వలన అగ్నిని కళ్ళతో చూడగలమేగానీ తాకలేము. తాకితే శిక్షిస్తుంది.

వాయువు రస, గంధ, రూపములనే గుణాలను త్యాగం చేయటం వలన మనం వాయువును ఈ కళ్ళతో చూడనైనా చూడలేము. వాయువే తనంతతాను మనలను స్పృశించి తన వునికిని మనకు తెలియజేస్తుంది. ఆకాశం రస, గంధ, స్పర్శ, రూపాలనే గుణాలను త్యాగం చేయడం వలన అది మన కళ్ళకు కనిపించకుండా తను వున్నానని మనలను భ్రమింపజేస్తుంది.

కేవలం ఒకే ఒక గుణం (శబ్దం) వున్న ఆకాశాన్నే మనం చూడలేనప్పుడు ఏ గుణమూ లేని ఆ 'నిర్గుణ పరబ్రహ్మ' ఎలా ఈ భౌతిక నేత్రానికి కనిపిస్తాడు? అలా చూడాలంటే మన మనోనేత్రాన్ని తెరవాలి. దాన్ని తెరవాలంటే పాంచభౌతిక తత్త్వాలైన గుణాలను అనగా ప్రాపంచిక విషయ వాసనలను త్యజించాలి. అప్పుడు నీవు 'నిర్గుణుడ'వు అవుతావు. అప్పుడు నీవే 'పరమాత్ముడ'వు అవుతావు. నిన్ను నీలోనే దర్శించుకుంటావు. అదే 'అహం బ్రహ్మోఽస్మి' అంటే. 'నిన్ను నీవు తెలుసు కోవడమే' దైవాన్ని దర్శించడమంటే. అదే దైవసాక్షాత్కారమంటే.

# శ్రీ సద్గురు వాణి

(గత సంచిక తరువాయి) సేకరణ - డా॥ రాఘవేంద్ర రావు. పి.

ఇంద్రియాలకు తెలియరానిది, శాస్త్రములకు అందనిది, అంటే దేనికీ అందనిది బ్రహ్మామృతమంటే. అట్టి జగజ్జనని పాదారవిందాల యందు మనసు నిలిపితే ఈ దు:ఖరూపమైన సంకటములను, బాధలను హరింపజేసి, ఆనందాన్ని, శక్తిని అందిస్తూ, మానవుడి ఈర్ష్య అసూయాది గుణాలను హరింపజేసి, ఆనందాన్నిస్తుంది. మానవునికి మానవునికి మధ్య భేదమును నశింపజేస్తుంది. ప్రేమ ఆవిడ రూపము. ఆమె నామము, స్పర్శ అన్నీ ప్రేమ మయమే. అటువంటి జగజ్జనని మహోత్సవాలలో పాల్గొని జగజ్జనని కటాక్షమునకు పాత్రులై ఈ ప్రేమామృతమును పొందుతున్నారు. ఇహ మీకెందుకు భయం? భయరహితమైన జ్ఞానాన్ని ఎప్పుడు ఈ పాత్ర నిండా నింపుకుంటారో ఇహ మీకు కావలసినదేమున్నది?

ఏ విషయములూ మీ దగ్గరకి రావని అభయమిస్తుంది. చక్కని మందహాసంతోటి చిరునవ్వు చిందులాడుతూ బిడ్డల మీద తన కృపా రసాన్ని వర్షింపజేస్తుంది. ఆ అభయ కిరణములలో జీవిస్తూ మీ మనస్సు నా యందు వుంచండి, మీకు కావలసినవన్నీ నేనే చూస్తాను అని అభయమిస్తోంది అనంత పరబ్రహ్మ స్వరూపిణి, గురుస్వరూపిణి. భయం వలదు అని అభయమిస్తుంది - ఇది సత్యము.

భగవంతుని ఎడల భక్తుడు చేయవలసినదేమిటి? ఏమీ చేయనక్కర్లేదు. మనస్సును భగవంతుని యందు వుంచడమే. గీత మొదటి నుండి చివర వరకూ ఒక్కటే చెబుతోంది త్యాగం. అంటే నీ మనసు నా యందు వుంచు - అని చెబుతోంది. గృహస్థులందరికీ ఎంతో తేలిక మార్గం చూపిస్తోంది భగవద్గీత. ధ్యానం చేసినప్పుడు జపమాల త్రిప్పడం కాదు. దాన్ని మరచిపోయి ఆ పరమాత్మ రూపాన్ని పొంది ధ్యానించాలి. అప్పుడు తదాకారాన్ని పొందుతారు. నది సముద్రంలో కలసి సముద్ర రూపాన్ని పొందుతుంది. దాని రూపాన్ని, శబ్దాన్ని పొందుతుంది. నది తన రూపాన్ని కోల్పోతుంది. నదికి సముద్రాన్ని చేరితేనే

పరిపూర్ణ శాంతి. మధ్యలో అడవులు, మృగాలు ఏవి అడ్డువచ్చినా తపిస్తూ ప్రణవనాదముతో పరుగిడుతూ వెళ్లి సముద్రంలో కలిస్తేనే శాంతి. తదాకారాన్ని బ్రహ్మాకారాన్ని పొందుతుంది. అలాగే భక్తునికి ఆవేదన వుండాలి. గమ్యస్థానం చేరేవరకు రాధ కూడా గోవిందుని వియోగం భరించలేకపోయింది. నదిలో చేప గట్టు మీద పడితే ఎలా తపిస్తుందో అదే విధంగా గోవిందుని చేరే వరకు భక్తుడికి అంతటి తపన ఉండాలి.

పింఛం మధురం, సర్వం మధురం, మధురాధిపతే అఖిలం మధురం - స్వామి మోక్షస్వరూపుడు, అనంతుడు, అవ్యాజ కరుణానిధి. సమస్త జీవకోటికి ఆనందాన్నిచ్చే ఆనంద స్వరూపుడు. రూప దర్శనాన్ని రాధ ఆస్వాదిస్తుంది. స్వామి వియోగాన్ని భరించలేక తపిస్తూ వుండేది రాధ. - 'ద్వారకానాధా! ఏ వ్యవహారంలో, ఏ రాజకీయాలలో మునిగావో, ఏ భక్తి త్రాళ్లతో బంధింపబడ్డావో ఏమో నా హృదయవేదన నీకు తెలియదా?' అని రాధ రోదించేది.

-సశేషం



# ఎవరు గొప్ప ?

- సుషుమ్నా ప్రసాద

భగవంతుని సృష్టిలో మానవుడిని ఉత్తమోత్తమ 'జీవి' గా పరిగణిస్తారు. భగవంతుడు తాను సృష్టించిన ఈ బొమ్మ ఆధ్యాత్మిక శిఖరాలను అధిరోహించడానికి ప్రతిబంధకాలను కూడా సృష్టించాడు. ఎవరైతే ఈ ప్రతిబంధకాలను అధిగమించి, ఆధ్యాత్మికోన్నతిని సాధిస్తాడో, ఆ వ్యక్తియే సర్వ శ్రేష్టుడిగా నిర్ణయింపబడతాడు.

ఆధ్యాత్మిక పురోగతిని సాధించడానికి మానవునికి అహంకారమనేది బలీయమైన ప్రతిబంధకము. అహంకారం నుండి మమకారం వుద్భవిస్తుంది. ఈ అహంకార, మమకారములనేవి జంటగా మానవుని అధోగతికి పెద్దపీట వేస్తాయి.

మానవుడు సంఘజీవి. పదిమందితో కలసి జీవిస్తాడు. ఎక్కడ నలుగురు వ్యక్తులు చేరతారో, వారిలో వారికి వివాదాలు ఏర్పడి, 'నేను గొప్ప అంటే నేను గొప్ప' అని అహం భావనతో విర్రవీగుతారు. ఇతరులకంటే నేను అధికుణ్ణి అనే అహం భావనయే మానవుని తిరోగతికి ప్రధమ సోపానము. ఈ అహంకారమనేది కూకటి వేళ్ళతో పాతుకుపోయి, 'ఇది నా స్వంతం. దీనిమీద మరెవరికీ హక్కు లేద'నే మమకారమునకు పునాది రాళ్ళను వేస్తుంది. ఎవరికి వారు నేను అందరికంటే అధికుణ్ణి, నాతో ఈ విషయంలో పోటీరాగల మొనగాడు ఎవరూ లేరనే అహం భావనతో, మానవునికీ మానవునికీ మధ్య వివాదముతో, వైషమ్యంతో యుద్ధాలతో, దేశ ప్రగతి స్తభించిపోతుంది.

ఈ విషయాన్ని చక్కగా వివరించడానికి ఛాందోగ్యోపనిషత్తులో చక్కని కథ వున్నది. శరీరధారి తానే గొప్ప అని ఎలా అహంకరిస్తాడో అలాగే ఒకప్పుడు శరీరంలోని ఇంద్రియాలకు కూడా వివాదం ఏర్పడింది. చెవి, కన్ను, నోరు, ముక్కు మొదలగు అవయవాలు నేను గొప్పంటే నేను గొప్పయని, నేను లేకపోతే ఈ శరీరధారి జడపదార్థము. వాని జీవనశైలి స్తంభించి పోతుందనుకున్నారు. చెవి ముందుకు వచ్చి 'ఇంద్రియాలన్నిటిలో నేనే గొప్ప. నేను లేకపోతే మాట వినబడదు. మనుగడే లేదు. చెవిలేకపోతే మనిషి శవముతో సమానం' అన్నది.

ఇంతలో నోరు ముందుకు వచ్చి, 'ఓ చెవీ! ఎందుకలా విర్రవీగుతావు? నోటి నుండి శబ్దం వస్తేకదా నీకు వినబడేది. కాబట్టి నీవు నా బంటువి. మెదలకుండా కూర్చో. నోటితో మాట్లాడితే కదా ఒకరి

భావం మరొకరికి తెలిసేది, అది లేకుంటే మానవులంతా స్తబ్ధులవుతారు. కాబట్టి నువ్వు నాకు దాసోహం అనాలి' అన్నది.

ఇంతలో కన్ను ముందుకు వచ్చి, 'ఏమిటే నోరూ! తెగ పేలుతున్నావు? నీ నాలుకను అదుపులో వుంచుకో. లేకుంటే నిన్ను (నాలుకను) కోసేస్తాను. నేను మీ అందరికంటే అధికమనే విషయాన్ని విస్మరించారా! నేను లేకుంటే జీవితమంతా అంధకార బంధురమేకదా' అని గర్జించింది.

ఇలా వివాదంలో వెనుకంజ వేయకుండా కయ్యానికి ముందుకు వచ్చాయి అన్ని ఇంద్రియాలు కూడా. ఇలాగే కుటుంబంలో కూడా వివాదాలు రాకూడదు. వచ్చాయి అంటే సమస్య ఎంతకీ పరిష్కారం కాదు. చినికి చినికి గాలివాన లాగా, వివాదం పెరిగి పెరిగి పెద్దదయి గడ్డు సమస్యగా తేలుతుంది.

ఇక ఈ సమస్యను పరిష్కరించుకోవడానికి ఇంద్రియాలన్నీ కలసి తమను సృష్టించిన ప్రజాపతి వద్దకు వచ్చాయి. ఆయనకు నమస్కరించి విషయాన్ని విన్నవించాయి. 'మాలో మాకు తగువులు వచ్చాయి మాలో ఎవరు గొప్పో మేము నిర్ణయించుకోలేక పోతున్నాము. కాబట్టి మీరెలాంటి తీర్పునిచ్చినా సరే మేము దానిని శిరసా వహిస్తాము' అని శరణుపొందాయి.

వాస్తవానికి ఇంద్రియాలు తగాదా పడవలసిన అవసరమే లేదు. పరమేశ్వరుడు ప్రాణుల శరీరంలో ఆ యా ఇంద్రియాలకు వేరు వేరు స్థానాలను, వేరు వేరు పనులను పురమాయించాడు. అలాంటప్పుడు అవి వాటి వాటి పనులను నిర్వహించకుండా తమ కర్తవ్యాన్ని విస్మరించి, వ్యర్థ తగాదాలకు లోనయ్యాయి. ఎలాగంటే మనిషి వివాదానికి లోనయ్యాడంటే వెనక ముందులు ఆలోచించకుండా, అతని మనస్సు ద్వేషభావంతో నిండిపోతుంది. కలుషితమై విచారణ శక్తిని కోల్పోతుంది. తన చేయి దాటి పోయిన తరువాత ఇతరుల సహాయం కోరతాడు. అలాగే ఇంద్రియాల విషయంలో కూడా జరిగింది. ఇంద్రియాల వివాదాలన్నీ విన్న తరువాత విధాత తన తీర్పును ఇలా ఇచ్చాడు 'ఓ ఇంద్రియములారా! మీలో ఎవరైతే ఈ శరీరాన్ని విడిచిపెట్టి వెళ్ళిన తరువాత ఆ శరీరము తేజో విహీనమై, శరీరం పనులన్నీ ఆగిపోతాయో, ఆ ఇంద్రియమే గొప్పది. అన్నిటి కంటే అది శ్రేష్ఠమైనది.'

-సశేషం



త్రిగుణాలు
మధుప
ఈ గదంతా ఎంత చీకటిగా ఉందో! ఏమీ కనిపించట్లేదు.
1
ఇక్కడేదో కుండలాగా ఉంది. దీనిని తీసి చూస్తాను.
2


ఈ కుండలో ఏదో
దీపం ఉన్నట్లుంది.
కానీ ఇంకా మసకగానే
ఉంది.
3


ఈ కుండని కూడా
తీసేస్తే దీపం బాగా
కనిపిస్తుందేమో
చూద్దాం!
4


ఇప్పుడు గదిలో
వస్తువులన్నీ చక్కగా
కనిపిస్తున్నాయి.
5


అయ్యయ్యో!
ఇంతలోనే ఈ చిమ్నీకి
మసిపట్టి గదంతా
చీకటి
అయిపోయిందే!
6


ఆ! ఆ చిమ్నీ కూడా తీసేస్తే ఇంక ఈ గదంతా వెలుగే!
7


ఆ గదిలో దీపంలాగే మనలో కూడా ఆత్మజ్యోతి నిరంతరం ప్రకాశిస్తూనే ఉంటుంది. అయితే దానికి త్రిగుణాలతో కూడిన మనస్సు అడ్డు పడటం వలన మనం ఆ వెలుగును చూడలేక అజ్ఞానమనే చీకటిలో బాధలు పడుతున్నాం. మొదటి కుండ అయిన తమోగుణాన్ని తొలగించుకుంటే కొద్దికొద్దిగా ఆ జ్యోతి కనిపిస్తుంది.
రెండవదైన రజోగుణమనే చిల్లులకుండను కూడా తొలగిస్తే అప్పుడు ఆ వెలుగు పూర్తిగా కనిపిస్తుంది. కానీ మూడవదైన సత్వగుణమనే ఆ గాజు చిమ్నీకి కూడా ఎప్పటికైనా మసి పట్టవచ్చు. ఆ అడ్డుకూడా తొలగించినప్పుడు ఇక అక్కడ చీకటికి తావులేదు. నీ అసలు స్వరూపమైన వెలుగువు నీవౌతావు.
8

# సాధనే ముక్తికి మార్గం

(గత సంచిక తరువాయి) - వి. రవి కుమార్

కిరాత రాజు ఆలోచించి ఇలా అన్నాడు. 'అమ్మా! నువ్వు చెప్పింది నిజం. జ్ఞానం కలిగిన తరువాత దుస్సంస్కారాలు తొలగిపోతాయి కాని, శరీర సంస్కారాలు మారవు కనుక బ్రహ్మజ్ఞానివైనా నీకు మాంసాహారమే కావాలి. మాంసాహారి యైనా బ్రహ్మజ్ఞాని పూజ్యుడే కనుక నేను అతిథి మర్యాదలు చేసి తీరాలి. నేను ఒక ఉపాయం చెబుతాను. నీవు పెద్దముత్తయిదువ వేషం వేసుకుని మా ఇంట్లో వుండిపో. ఆరు రోజులలో మా రాజ్యంలో మరణ దండన విధించినబడిన వాళ్ళందరినీ పోగేసుకుని వస్తాను. వారందరినీ నీవు నీ కొండగుహకు చేర్చుకుని అక్కడ ఆరగించు. నా మరణ దండన నెరవేరినట్లవుతుంది, నీ ఆకలి తీరినట్లు అవుతుంది. ఎలాగూ మరణ దండనతో చనిపోబోయే వారిని భుజిస్తున్నావు కాబట్టి ఇది పాపం కాదు. ఇలా ఆకలి తీర్చుకుని బ్రహ్మ సమాధిలోకి వెళ్ళిపో. మళ్ళీ ఆకలి వేసినప్పుడు మరలా రా. నేను తిరిగి పోగేసుకుని వస్తాను' అని చెప్పాడు. కర్కటి అందుకు అంగీకరించింది.

ఈ ఆరు రోజులలో రాజుగారు మరణదండన విధింపబడ్డ మూడువేలమందిని పోగేసుకుని రాగా కర్కటి తన నిజరూపం దాల్చి ఆ మూడువేలమందిని గుప్పెటలో ఇరికించుకుని, గుహకు చేరి మ్రింగివేసింది. దెబ్బకు మత్తు వచ్చి మూడు రోజులు నిద్రపోయింది. తరువాత లేచి స్నానం చేసి, సమాధిలో కూర్చుంది. ఆరు సంవత్సరాలు సమాధిలో వుండిపోయింది. తరువాత కళ్ళు తెరచి, ఆకలి అనిపించి కిరాత రాజ్యానికి వచ్చింది. మళ్ళీ రాజు నేరగాళ్ళను ప్రోగేసుకుని రాగా ఆకలి తీర్చుకునేది. ఆ విధంగా కిరాత రాజ్యానికి కర్కటికి స్నేహ బంధం ఏర్పడింది.

కర్కటి వచ్చిపోతుండటంతో రాజ్యంలో కొన్ని శుభ పరిణామాలు చోటు చేసుకోసాగాయి. వచ్చిపోయినప్పుడల్లా పిశాచ బాధలన్నీ పోయాయి. ఆవిడ ఆశీస్సులు పొందినవారికి దీర్ఘకాల రోగాలు తగ్గాయి. ఏ నేరగాళ్ళను ఆరగిస్తున్నదో ఆ నేరగాళ్ళ వంశంలో ఉత్తమ జీవులు జన్మిస్తూ వుండేవారు. రాజ్యంలో ప్రకృతి వైపరీత్యాలు తలెత్తేవి కాదు.

ఇలాంటి అనుభవాల వలన కర్కటి కథ మెల్లమెల్లగా ఇతర రాజ్యాలకు విస్తరించింది. వివిధ రాజ్యాల రాజులు ఆమెను స్వచ్ఛందంగా ఆహ్వానించి బలులు సమర్పించడం మొదలు పెట్టారు. కానీ పోను పోను కర్కటికి ఆకలి తక్కువయి సమాధి స్థితి ఎక్కువ కాసాగింది. ఆవిడ రాజ్యాలకు రావడం తగ్గిపోయింది. దీనితో ప్రజలే తమ కోర్కెలు తీర్చుకోవడానికి ఆవిడ గుహ దగ్గరకు వెళ్ళి కర్కటీపూజలు చేసేవారు. ఈ పూజలకు కందర పూజలని పేరు పెట్టడం జరిగింది. కర్కటి రాక్షసి అలా బ్రహ్మనిష్ఠలో వుంటూ తన శరీరం చాలించింది.

ప్రజలు ఇంకొక అడుగు ముందుకు వేసి, కందర దేవాలయాలు కట్టి, పూజలు చేసి తమ గ్రామాలకు కలిగిన ఉత్పాతాలను తొలగించుకునేవారు. ఆ విధంగా ఒక బ్రహ్మరాక్షసి బ్రహ్మజ్ఞానియై పూజలందుకుని దేవతగా కొలువబడినది. పరబ్రహ్మలో లీనమైపోయి ముక్తి పొందినది.

కనుక మనమందరం తెలుసుకొనవలసిన విషయమేమిటంటే ధ్యాన నిష్ఠకు, ఆత్మజ్ఞాన సాధనకు జాతి, రూప, కుల, వయో భేదం లేదు. అందరమూ అది పొందటానికి అర్హులమే. అయితే ఎంత సాధన చేస్తే అంత మార్గం సుగమం అవుతుంది. శ్రీగురుదేవుల స్మరణ, వారి బోధా శ్రవణము, విచారణ, వాటి నిరంతర పాలన మనలను ఆత్మజ్ఞానం వైపు తీసుకువెడుతుంది. కనుక మనందరము శ్రీగురుదేవుల అనుగ్రహానికి పాత్రులమై బ్రహ్మ పదాన్ని పొందెదము గాక!

*ఆరోగ్యమే ఉత్తమ లాభం, సంతృప్తియే సంపద!*

*దీర్ఘ జీవితం కంటే దివ్య జీవితం గొప్ప!*

*సత్సంకల్పం సద్గతికి, దుస్సంకల్పం దుర్గతికి దారి తీస్తుంది!*

\- శ్రీ కాళీబాబు

# గోదావరి స్నానాలు

- జి. శైలజ

ఒకరోజు నాన్నగారు నన్ను బాబూజీ దగ్గరకు తీసుకుని వెళ్ళారు. బాబూజీ నాన్నగారితో 'పాపను ఇక్కడ వదలి వెళ్ళండి' అన్నారు. 'సరే' అని నాన్నగారు నన్ను అక్కడే ఇంజనీరు సుబ్బరాజుగారి దగ్గర వదలి వెళ్ళారు. బాబూజీ వారితో 'ఆ పాపను మీతో ముంజవరపుకొట్టుకు తీసుకుని రండి' అన్నారు. అప్పుడు నేను చదువుకునే రోజులు. స్టైల్‌గా రెండు జతలు పెట్టుకుని ప్రయాణమయి ఆ గ్రామానికి చేరుకున్నాను. ఆ ఇంటివారు మహాభక్తులు మేము వున్నన్ని రోజులూ విసుగు లేకుండా సేవ చేశారు. రెండు రోజులని వెళ్ళి, మూడు నెలలు వుండిపోయాం. కృష్ణుడి కాలంలో గోపికలు గోపాలునితో ఎంత అమాయకంగా, ఆటపాటలతో ఎలా మెలిగారో, ఇక్కడ వారంతా బాబూజీతో అలా గడిపారు. ఇక్కడే గురువుగారు (లలితానంద సరస్వతీ స్వామిని)మాకు భగవద్గీత భక్తియోగం నేర్పించారు. బాబూజీ మాకున్న ఎన్నో సందేహాలను తీర్చారు. బాబూజీ మాట్లాడుతూ 'రాబోయే రోజులలో ఎవరి పని వారే చేసుకోవాలని, పనివాళ్ళు దొరకరని, సంగీత వాయిద్యములన్నీ ఎలక్ట్రానిక్స్‌లో వస్తాయని, బోధ గురువుల కంటే బాధ గురువులు ఎక్కువ వుంటారని' చెప్పారు.

ఇలా వుండగా శివరాత్రి వచ్చింది. ముందురోజు మేమందరమూ గోదావరి స్నానానికి వెళ్ళాము. శ్రీబాబు నదిలో నడుస్తున్నారు. నీటిలో ఆయన వెంట భక్తులు నడుస్తున్నారు. బాబూజీ అలా నది మధ్యకు వెళ్ళి నిలబడ్డారు. ఆయన చుట్టూ భక్తులు నిలబడ్డారు. ఇదంతా నేను ఒడ్డున కూర్చుని చూస్తున్నాను. వారిలో చాలా మందికి ఈత రాదు. అలా ఎలా నడిచారో అని ఆలోచిస్తున్నాను. అంతా విచిత్రంగా వుంది. ఇంతలో ఇద్దరు భక్తులు వచ్చి బాబూజీ నిన్ను తీసుకురమన్నారు అని చెప్పారు. నేను రాను నాకు నీరంటే భయమని చెప్పాను. ఏమీ కాదని చెప్పి బలవంతంగా తీసుకువెళ్ళారు. నదిలో నడుస్తూనే బాబూజీ దగ్గరకు వచ్చాము. గురువుగారు ఒక చిన్న చెంబులో పాలు నైవేద్యంగా సమర్పించి మాకందరికీ ప్రసాదంగా ఇచ్చారు. ఆ తరువాత ఒక్కొక్కరూ శ్రీబాబు పాద పద్మాలకు నీటిలో మునిగి నమస్కరించారు. నా వంతు వచ్చింది.

భయం వేసింది. నేను బాబూజీని తలుచుకుంటూ వున్నప్పుడే నన్ను ముంచారు. నమస్కరించి పైకి వచ్చాను. బాబూజీ 'పాపా! ఎలా వుంది?' అని అడిగారు. ఏమని చెప్పను? అది భయమో ఆనందమో ఆశ్చర్యంగా వుంది అన్నాను. 'ఇంకెప్పుడూ ఇలాంటి దృశ్యం చూడలేవు' అన్నారు. ఆ సంఘటన మళ్లీ మళ్లీ గుర్తుకు వస్తూనే వుంటుంది.

అలనాడు శ్రీ ఆదిశంకరాచార్య ఆయన శిష్యుని (సనందుడు) నదికి ఆవలి గట్టు నుండి పిలిస్తే ఆ శిష్యుడు ఏమీ ఆలోచించకుండా, నది అన్న ధ్యాస లేకుండా, నడుచుకుంటూ వెళ్ళాడు. ఆయన గురుభక్తికి మెచ్చి ఆయన పాదాల క్రింద పద్మాలు వికసించాయి. అందుకే ఆయనను పద్మపాదుడని పిలిచేవారు. ఈనాడు బాబూజీ భక్తులకు ఈత రాదు. నమ్మకమనే ఈతతో గురుదేవుల చెంత చేరారు. గురుభక్తికి ఇదొక ఉదాహరణ.

ఆ తరువాత శివరాత్రి రోజున శ్రీ గురుదేవులకు సహస్ర ఘటాభిషేకం. అందరూ గోదావరి నుంచి బిందెలతో నీళ్ళు తెచ్చి, అభిషేకం చేసుకున్నారు. ఆ రాత్రి నాలుగైదు పడవలు కలిపి కట్టి, దానిపై స్టేజి కట్టారు. అందరూ ఎక్కాక పడవలు గోదావరి మధ్యకు ఎప్పుడు వచ్చాయో తెలియలేదు. రాత్రి అంతా బాబూజీ ఉపన్యాసాలతో, గురుపూజతో, సంకీర్తనలతో గడిపాము. గట్టు దగ్గరకు ఎప్పుడు వచ్చామో తెలియదు.

అక్కడ వున్నన్ని రోజులూ బాబూజీతో ఆనందంగా గడిపాము. బాబూజీతో చాలా సన్నిహితంగా వుంటూ, మా సందేహాలను తీర్చుకునేవాళ్ళము. వ్రేపల్లెవాసులు కృష్ణుడితో గడిపినట్లు మేమంతా బాబూజీతో గడిపాము. కనుక మాకు ముంజవరపు కొట్టులో గడిపిన రోజులు స్వర్ణయుగం లాంటివి.

# గుర్వష్టకమ్

(గత సంచిక తరువాయి)

- వారణాసి కాళీప్రసాద్ (అమెరికా)

***యశోమే గతం దిక్షు దాన ప్రతాపా ।***
***జగద్వస్తు సర్వం కరే యత్ప్రసాదాత్ ।***
***గురోరంఘ్రి పద్మే మనశ్చే న లగ్నం ।***
***తత:కిమ్ తత:కిమ్ తత:కిమ్ తత:కిమ్ ॥***

నలుదిశలా దాన ప్రతాపములచేత వ్యాపింపబడిన కీర్తి కలిగి వున్నప్పటికీ, తత్ఫలితముగా జగత్తులో పొందదగిన వస్తు విశేషాలన్నీ చేతికి అందుబాటులో వున్నప్పటికీ, గురుపాదపద్మముల యందు మనస్సు నిలుప లేకపోయినప్పుడు వ్యర్థమేనని ఈ శ్లోక తాత్పర్యము.

***యశోమే గతం దిక్షు దాన ప్రతాపా -***

అష్టకములోని మిగతా శ్లోకాల తరహాలో ఈ శ్లోకంలో కూడా శంకరులు లోతైన అంశాలను పొందు పరచారు. దానము వలన, ప్రతాపము వలన కలిగిన కీర్తి అహంకారము నకు లోను కాకూడదనీ, దానము వెనుక వున్న త్యాగ గుణమునూ, ప్రతాపము వెనుక వున్న ధీరత్వమునూ ప్రకాశింపజేసే చైతన్యమునకు చెందినవనీ ఈ శ్లోకం తెలియజేస్తోంది. నలుదిశలా వ్యాపించిన కీర్తిని దిక్కులనే అంబరముగా కలిగిన అప్రమేయుడైన జగన్నాధుని కృపగా గుర్తించాలని దీని సారాంశము.

***జగద్వస్తు సర్వం కరే యత్ప్రసాదాత్ -***

మరి అలాంటి కీర్తి కలిగిన వారికి తత్ఫలితముగా ఇహలోకంలో పొందదగిన వస్తువులన్నీ అందుబాటులో వుండటం సహజమే. కానీ వాటన్నిటినీ తన గొప్పదనానికి నిదర్శనమని గర్వపడకుండా, భగవత్ప్రసాదంగా భావించినప్పుడు ఆ విషయాలే భగవంతుని పట్ల కృతజ్ఞతను ప్రదర్శించడానికి దోహదపడతాయి. యత్ప్రసాదాత్ అన్న విషయాన్ని పరిశీలిస్తూ, ఇవన్నీ ఎవరి ప్రసాదమని విచారణ బయలుదేరి నప్పుడు సాధనా మార్గంలో పురోగతి కలుగుతుంది. మరికొంత విశ్లేషిస్తే అలాంటి సాధకుడికి భౌతికపరమైన విషయాలను గురించిన చింతన కూడా అవసరము లేదు. గీతాచార్యులు భగవద్గీతలో ఇదే విషయాన్ని

శలవిచ్చారు.

***అనన్యాశ్చింతయన్తో మాం యే జనాఃపర్యుపాసతే।***
***తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహం ॥***

ఎవరైతే అనన్య భావనతో నిరంతరము నన్ను స్మరిస్తారో, వారి యోగ క్షేమాలను నేనే స్వయంగా వహిస్తానని జగద్గురువుల హామీ. ఆ విధంగా గురుపాదపద్మములను స్మరించేవారికి ఇహపరములు రెండూ అనాయాసముగా అందుబాటులో వుంటాయి.

అదే విషయాన్ని ప్రకటిస్తున్నారా అన్నట్లు శ్రీబాబూజీ మహరాజ్ 'శ్రీకరాయ నమః' అనే నామంతో విరాజిల్లుతూ, శ్రీ - ఐశ్వర్యాన్ని, మోక్ష సామ్రాజ్య లక్ష్మినీ మనందరికీ ప్రసాదిస్తానని అభయమిస్తున్నారు.

సాధకులందరికీ గురుపాదపద్మముల మీద చింతన మాత్రమే ఆవశ్యకమని ఈ శ్లోకం వివరిస్తోంది.

-సశేషం

## పెదనిండ్రకొలను శాఖలో కార్యక్రమాలు

**మే 2020**

7 గురు - శ్రీగురు (వైశాఖ) పౌర్ణమి - శ్రీ సద్గురు పాదపూజ, భక్తసమారాధన.

17 ఆది - శ్రీగురుదశమి - హనుమజ్జయంతి - శ్రీసద్గురుపాదపూజ.

**జూన్ 2020**

5 శుక్ర - జ్యేష్ట పౌర్ణమి - శ్రీసద్గురుపాదపూజ.

15 సోమ - శ్రీగురుదశమి - శ్రీసద్గురుపాదపూజ.

21 ఆది - అమావాస్య - సూర్యగ్రహణం ఉ॥ 10-25ని॥ నుండి మ॥ 1-54ని॥ వరకు (మృగశిర నక్షత్రం, మిధునరాశి)

# భజ  గోవిన్దమ్

(గత సంచిక తరువాయి) - రమణ ప్రసాద్

**10. వయసిగతే కః కామ వికారః శుష్కే నీరే కః కాసారః।**

**క్షీణే విత్తే కః పరివారః జ్ఞాతే తత్త్వే కః సంసారః॥**

యవ్వనం ఉడిగిన తరువాత కామ వికారమెక్కడిది? నీరు ఎండిన తరువాత కాసారమెక్కడిది? ధనం నశిస్తే పరివారం ఎక్కడిది? తత్త్వం తెలిసిన వానికి సంసారంతో పని ఏముంది?

పటుత్వం ఉన్నప్పుడు, యౌవనపు జిగి బిగి కలిగి ఉన్నప్పుడు, కామ వికారం ఏర్పడుతుంది. పటుత్వం తగ్గి దేహం ముడుతలు పడితే, అవసాన దశలో కామ వికారం ఎక్కడ ఉంటుంది?

నీళ్ళు ఉంటేనే చెరువు అంటారు. నీళ్ళు లేక ఎండిపోతే దానిని చెరువు అనరు. అధికారం, డబ్బు ఉన్నప్పుడు అందరూ నీ మిత్రులు, బంధువులు అవుతారు. ధనం నశించాక ఎవ్వరూ నీ చుటుప్రక్కల కనిపించరు. బ్రహ్మత్వం తెలిసిన వానికి సంసారంతో పని లేదు. ఆ తత్త్వాన్ని గ్రహించినవాడు సాక్షాత్తు భగవంతుడే అవుతాడు.

అదే అద్వైతంలో 'తత్త్వమసి' (అది నీవై ఉన్నావు), 'సోఽ హం' (వాడే నేను) అనే వాక్యాలకు అర్థం. అవిద్య భయ దుఃఖాలకు కారణం అవుతుంది. నిత్యమైనదేదో తెలియక కొట్టుమిట్టులాడతాడు. అవిద్యవల్ల, వాసనవల్ల, నిత్యమైనది, సత్యమైనది అనుభవానికి రాదు. అవిద్య, వాసనలు తొలిగితే, ఇంక వికారాలు ఎక్కడివి? సత్యం తెలిస్తే, సందేహాలకు తావెక్కడిది? వాసనలు తొలిగి, అహంకారం తొలిగితే, సత్య వస్తు దర్శనం అవుతుంది. అప్పుడు 'నేను' అనే భావం పోయి అనంత చైతన్యంలో ఉండిపోతాడు.

**11. మాకురు ధన జన యౌవన గర్వం హరతి నిమేషాత్కాల సర్వం।**

**మాయామయమిదమఖిలం హిత్వా బ్రహ్మ పదం త్వం ప్రవిశ విదిత్వా॥**

నీ ధనాన్ని, పరివారాన్ని, యౌవనాన్ని తలుచుకుని గర్వ పడకు. ఇవన్నీ క్షణంలో హరిస్తాయి. ఇది అంతా మాయ అని తెలుసుకుని బ్రహ్మ పదంలోకి ప్రవేశించు.

నేను, నా వారు అనే మాటలు విడిచి పెట్టు. జీవితం నీటి బుడగ వంటిది. మసక వెలుతురులో తాడును చూసి పామను కుంటున్నట్లు, అజ్ఞానంతో అశాశ్వతమైనదానిని, శాశ్వతమని భ్రమించకు. ధనం శాశ్వతం కాదు. ఎందరో ధనికులు దరిద్రులు అయ్యారు. దరిద్రులైనవారు కోటికి పడగెత్తినవారున్నారు. ధనగర్వంలో, అధికార గర్వంలో చిక్కుకోకు. సత్యము, శాశ్వతము అయిన బ్రహ్మపథం గురించి తెలుసుకో. చూసేవాడు, అనుభవించేవాడు, యోచించేవాడు ఎవరో దానితో తాదాత్మ్యం చెందు. సాక్షిగా ఉండి చైతన్యాన్ని అనుభవంలోకి తెచ్చుకో. అది నీ హృదయంలోనే ఉంది. 'అయమాత్మా పరబ్రహ్మ' (అంతటా పరబ్రహ్మమే) అని తెలుసుకో!

**12. దినయామినౌ సాయం ప్రాతః శిశిర వసంతౌ పునరాయాతః।**
**కాల క్రీడతి గచ్ఛత్యాయుః తదపిన ముంచత్యాశా వాయుః॥**

పగలు, రాత్రి, ఉదయం, సాయంత్రం, శిశిరం, వసంతం, వస్తూ ఉంటాయి, పోతూ ఉంటాయి. ఈ కాలం ఆడే ఆటలో ఆయువు తరిగిపోతూంటుంది. అయినా మానవుడు ఆశను విడిచి పెట్టడు.

ఇప్పుడే, ఈ క్షణమే తెలివి తెచ్చుకో! నిత్య సత్య స్వరూపుడైన భగవంతుని తెలుసుకో! కాలం గడిచిపోతోంది. భవిష్యత్కాలం వర్తమానకాలం అవుతోంది. వర్తమానం భూతకాలం అవుతోంది. కాలం ఎవ్వరి కోసమూ ఆగదు. మానవుడు తన పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ వర్తమానాన్ని మరుస్తాడు. భవిష్యత్ గురించి భయం పోగు చేసుకుంటాడు. కష్టాలు ఎదురౌతాయి.

బాలుడైన నచికేతుడు తాను యముని వద్దకు వెళ్తానంటే బాధ పడుతున్న తండ్రిని చూసి, ఈ విధంగా ఊరట చేస్తాడు - "పుట్టిన వాడు గతించక మానడు. గతించిన వాడు తిరిగి పుట్టక మానడు. ఏది నిత్యము కాదు" అని. నచికేతుడు యముడు నీకు దీర్ఘాయుష్షుని ఇస్తానంటే, "దీర్ఘకాలం జీవించేవాడు కూడా చివరికి మరణించాల్సిందే. నీ నృత్య గీతం సాగాల్సిందే"అంటాడు.

జీవితం కాలంలో ఇమిడి ఉంది. అది తెలియక మానవుడు ఆశాపాశాలలో చిక్కుకుని విషయ సుఖాలను అనుభవించటానికి తాపత్రయపడతాడు. చివరకు మృత్యువు పాలవుతాడు. ఏదీ తన వెంట

రాదు. సత్యాన్ని సుఖ దుఃఖాలనే ముసుగు కప్పివేసింది. **'హిరణ్మయేన పాత్రేణ సత్యస్యాపి హితమ్ ముఖమ్'** - ఈ క్షణిక భోగాలపై ఆశ వదులుకో. అది బంగారు లేడిలా కనిపిస్తుంది. కాని నిజం కాదు. ఇది మాయ యొక్క ప్రభావమని గ్రహించు. జీవితం గడిచిపోతోంది. కాని కోరికలు చావటం లేదు. శరీరం కృశించిపోతోంది. కాని ఇంకా ఆశ చావలేదు. చావు దగ్గరైనా ఆశా పాశాలు వదలటం లేదు అనే విషయాన్ని గ్రహించి, భగవంతుని ఆశ్రయించు. ఆత్మానందమే ఆనందం. ఈ ప్రాపంచిక విషయాల నుండి మనస్సు మరల్చుకో!

**శ్రీ శంకరాచార్య ప్రణీత "ద్వాదశ మంజరి" స్తోత్రం సమాప్తమ్।**

**సమర్థ సద్గురు మాసపత్రిక పాత ప్రతులను ఆన్‌లైన్‌లో చదవడానికి మీ స్మార్ట్‌ఫోన్‌తో ఈ ప్రక్కన ఇవ్వబడిన QR CODE స్కాన్ చేయండి.**

## హైదరాబాదు శాఖలో కార్యక్రమాలు

**మే 2020**

7 గురు - శ్రీగురు (వైశాఖ) పౌర్ణమి - శ్రీ సద్గురు పాదపూజ, భక్తసమారాధన.

17 ఆది - శ్రీగురుదశమి - హనుమజ్జయంతి - శ్రీసద్గురుపాదపూజ.

**జూన్ 2020**

5 శుక్ర - జ్యేష్ఠ పౌర్ణమి - సా॥ 5-30 గం. సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన

15 సోమ - శ్రీగురుదశమి - సా॥ 5-30 గం. సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ, భక్తసమారాధన

21 ఆది - అమావాస్య సూర్యగ్రహణం ఉదయం 10-25ని॥ నుండి మధ్యాహ్నం 1-54ని॥ వరకు (మృగశిరా నక్షత్రం, మిధునరాశి)

# శ్రీ కాళీగార్డెన్స్ ఆశ్రమంలో కార్యక్రమాలు

## మే 2020

7 గురు - శ్రీగురు (వైశాఖ)పౌర్ణమి - సత్సంగం, శ్రీ సద్గురు పాదపూజ, భక్తసమారాధన.

12 మంగళ - వైశాఖ బహుళ పంచమి - శ్రీమహాకాళికా పరమేశ్వరీసమేత శ్రీరామలింగేశ్వరస్వామి వారల ప్రతిష్ఠా వార్షికోత్సవము. రాత్రి 7గం. సామూహిక లీలా కళ్యాణ మహోత్సవము.

17 ఆది - శ్రీగురుదశమి - హనుమజ్జయంతి - సత్సంగం, శ్రీసద్గురు పాదపూజ.

21 గురు - మాసశివరాత్రి

22 శుక్ర - అమావాస్య

31 ఆది - జ్యేష్ట శుద్ధ నవమి - సుగుణ ప్రసాద మాతాజీవారి త్రయోదశ వార్షికారాధన.

**జూన్ 2020**

5 శుక్ర - జ్యేష్ట పౌర్ణమి - శ్రీసద్గురుపాదపూజ.

15 సోమ - శ్రీగురుదశమి - సత్సంగం, శ్రీసద్గురుపాదపూజ.

19 శుక్ర - మాసశివరాత్రి

21 ఆది - అమావాస్య. సూర్యగ్రహణం. ఉదయం 10-25 ని॥ నుండి మధ్యాహ్నం 1-54ని॥లు వరకు. (మృగశిర నక్షత్రం, మిధున రాశి)

# శత్రులు మిత్రులౌట

(గత సంచిక తరువాయి) - పాలూరి కాళీ ప్రసాద్

**లోభం -**

లోభియైనవాడు తనకున్న దానిని ఎవరికీ పెట్టలేడు, తాను అనుభవించలేడు. చేసే ప్రతి పనిలోనూ పిసినారితనం చూపిస్తూ, ఏదో తప్పనిసరిగా చేస్తాడు తప్పితే అందులో ఆసక్తి వుండదు. మరి ఇతడు తన మనస్సును భగవంతునిపై లగ్నం చేసి, ఆయన ప్రేమనుకొద్దిగానైనా చూరగొన్ననాడు ఆ భగవంతునికి తాను చేసే సేవలన్నింటి లోనూ ఎంతో శ్రద్ధ కనబరుస్తూ ఇష్టంగా చేయడం తనకు తెలియకుండానే అలవాటు చేసుకుంటాడు.

**మోహం -**

మోహమనే శత్రువుకు లోబడినవాడు తన భార్యాపిల్లలుగానీ, లేదా తనకు ఇష్టమైన ఏ వస్తువైనా కానీ ఒక్క క్షణం దూరమైనా తాను బ్రతకలేనన్నట్లు ప్రవర్తిస్తాడు. అలాగే తాను లేకుండా తన వాళ్ళు బ్రతకలేరనీ భావిస్తాడు. అయితే ఈ మోహాన్ని మోహనాకారుడైన పరమాత్మ మీదకు మరల్చిననాడు చివరకు ఆ పరమాత్మ ఒక్కడే సత్యమనీ, ఈ జగత్తులో తక్కినవన్నీ గతించిపోయేవేనన్న నిజాన్ని గుర్తించి ఆ పరమేశ్వర ప్రసాదంగా ఎప్పటికప్పుడు తనకు ఇతర వ్యక్తులతో లేదా వస్తువులతో కలిగిన సంయోగాన్ని, వియోగాన్ని కూడా సమదృష్టితో చూసి సమాధాన పడతాడు.

**మదం -**

మదం బాగా తలకెక్కినవాడు నా అంతటివాడు లేడని విర్రవీగుతూ, ప్రతివారినీ అవమానిస్తూ, తన బలహీనతల గురించి అవతలివారు నిజం చెప్పినా అది తనకు ఘోర అవమానంగా భావిస్తూ, ప్రతీకారాగ్నిలో రగిలిపోతూ వుంటాడు. కానీ ఇతడు పరమాత్మ యొక్క అనంత శక్తిని గుర్తించి తననూ, ఈ సమస్త ప్రపంచాన్నీ నడిపించేది ఆ పరమాత్మయే అన్న సత్యాన్ని అనుభవపూర్వకంగా ఎరిగిననాడు ఆ మదమే మానావమానాలను సమదృష్టితో స్వీకరించగలిగే తితీక్షగా మారిపోతుంది.

**మాత్సర్యం -**

మాత్సర్యం అనే దుర్గుణం కలిగినవాడు ఎప్పుడూ ఎదుట వ్యక్తి అభివృద్ధిని చూసి అసూయపడుతూ, మనస్సులో ఆ వ్యక్తి పతనాన్ని కాంక్షిస్తూ, బుద్ధితో అతని నాశనానికి ప్రణాళికలు రచిస్తూ. చిత్తంతో ఆ వ్యక్తి ఇంతకు ముందు ఎప్పుడో చేసిన తప్పులన్నింటినీ నెమరువేసుకుంటూ, అహంకారంతో ఆ వ్యక్తికి హాని కలిగేలా ప్రవర్తిస్తూ వుంటాడు. అదే వ్యక్తి తన హృదయంలో భగవంతుని నిల్పుకున్నప్పుడు, భగవానునే సర్వజీవకోటిలో దర్శిస్తూ, తన మనో,బుద్ధి, చిత్త, అహంకారాలతో సదా సర్వుల యొక్క అభివృద్ధినే కాంక్షిస్తూ తనకై ఏమీ ఆశించకుండా, ఎటువంటి మానసిక ప్రలోభాలకూ లోనుకాకుండా వుంటాడు. అటువంటి అంతరేంద్రియ నిగ్రహమే **శమము.**

మనకంటే బలవంతులెవరో మన ఆస్తిని ఆక్రమించారనుకోండి, మనం వారికంటే బలవంతులైన వారిని ఆశ్రయించి, మన ఆస్తిని కాపాడుకోవాలని ప్రయత్నిస్తాము కదా! అలాగే మన మనస్సును ఆక్రమించిన శత్రువులను చూస్తూ సినిమా పాటలో శాస్త్రిగారన్నట్లుగా 'మనసు మీద వయసుకున్న అదుపు చెప్పతరమా?' అనుకుంటూ వూరుకోకుండా ఆ మనస్సును అంతకంటే బలవంతుడైన భగవంతుని అదుపులోకి అర్పించగలిగితే ఆ స్థానబలంతో ఆ శత్రువులందరూ మనకు మిత్రులుగా మారిపోయి మన సాధన పురోగతి చెందటానికి ఎంతగానో సహకరిస్తారు.

## చందాదారులకు విజ్ఞప్తి

మీ మాసపత్రిక చందా నెంబరు LM అనే అక్షరాలతో ప్రారంభమయితే మీ చందా గడువు ఇప్పటికే ముగిసినది. అయినా శ్రీగురుదేవుల ఆధ్యాత్మిక సంపద అందరికీ అందజేయాలనే మహదాశయంతో ట్రస్టువారు స్వంత ఖర్చుతో ఇంకా పత్రిక మీకు పంపుతున్నారు. కనుక దయచేసి 1,116 రూలు చెల్లించి మీ చందాను పునరుద్ధరించు కొనవలసినదిగా విజ్ఞప్తి.

# కైవల్యోపనిషత్

(గత సంచిక తరువాయి) - రేఖ

ఆసనం మీద కూర్చున్నప్పుడు శరీరాన్ని తిప్పలు పెట్టకుండా, శరీరం ద్వారా మనస్సు బాధ పడకుండా వుండాలి. మెల్లగా శ్వాస బాగా తీసుకుని, దీర్ఘంగా ఓంకారాన్ని నాభి నుంచి కొంతసేపు పూరించాలి. అలాచేసినప్పుడు ఆ శబ్దం ద్వారా అంతఃకరణ ఎంత నిర్మలమవుతుందో మనకు అనుభవమైన విషయమే.

అటువంటి పవిత్రమైన, నిర్మలమైన అంతఃకరణతో ముఖ్యంగా బ్రాహ్మీ ముహూర్తంలో పూరించినప్పుడు ఆ శబ్దం విశ్వమంతా ఓంకారం పూరిస్తున్నట్లుగా మన అనుభూతికి వస్తుంది. ఓంకారం ఏకాక్షర శబ్దం. మంత్రం అది పరమాత్మకి ప్రతీకగా నిలిచే శబ్ద చిహ్నం. ఓంకారం సృష్టి అంతటికినీ కారణమైనది.

'ఓంకార జలధి పొంగి పొరలగా ఓం ఓం అని విశ్వమెల్ల నిండగా' అనే కీర్తనను ఆలపించి, శ్రీమాతాజీ 'మనకి ఎవరు నేర్పించారు ఆ శబ్దం పూరించడం సాక్షాత్తు ఆ చిన్నివాడు, నల్లనివాడు అయిన ఆ కృష్ణయ్య తన మురళీ రవం ద్వారా మనకి వినిపించాడు. మురళీ రవం ఓంకారంలాగా ప్రతిధ్వనించింది అంటే, ఆ మురళిలో అంతా ఖాళీగా వుండటం చేతనే. మనం కూడా షట్చక్రాలూ ఖాళీ చేసుకుని, యోగః చిత్త వృత్తి నిరోధకః అంటే మనసుని ఆ ప్రణవంలో లయింప జేస్తే ఎంత ఆనందమున్నది! ఏకాకార వృత్తి అది. ఆత్మానమరణిం అంటే జీవాత్మ క్రింది భాగంగా (క్రింద వుండే కొయ్య)గా చేసి, ప్రణవాన్ని పైన వుండే భాగం ఉత్తరారణిగా చేసి మథిస్తే వచ్చేది జ్ఞానాగ్ని. సర్వ ప్రకృతికి జీవాత్మకు ఆధారం ఓంకారం. అది ప్రణవం. పరమాత్మకు ప్రతీక. దాని వలనే సమస్తమూ ప్రకాశిస్తోంది.

అగ్నిమథనం చేసేటప్పుడు రెండు కొయ్యలకు మధ్య కొంచెం దూదిని వుంచుతారు. రాపిడికి నిప్పురవ్వలు వస్తాయి. ఆ నిప్పు ఈ దూదికి అంటుకుని మండుతుంది. మంటలో ఎండు పుల్లలు వేసి, బాగా రాజుకున్న తరువాత అగ్నికుండంలో వేసి ప్రజ్వలింపజేస్తారు.

కానీ ఈ జ్ఞానాగ్ని పుట్టించడానికి దూదితో పనిలేదు. ఎప్పుడైతే

మనం పైన చెప్పిన విధంగా ఓంకారోపాసన చేస్తామో మనలో కలిగే ప్రతి భావము, కనిపించే ప్రతి దృశ్యము, వినిపించే ప్రతి శబ్దం, మాట్లాడే ప్రతి మాట ఆత్మకి సంబంధించినదిగా వుంటుంది. తద్వారా ఆత్మావలోకనం చేసుకోగలుగుతాం. ప్రతి భావన సద్భావనే అవుతుంది. మహాత్ములు ఈ స్థితిలో వుంటారు. వారి తపస్సు అంతా వారి మాటల్లో ప్రస్ఫుటిస్తుంది. వారితో మాట్లాడాలనిపిస్తుంది. వారి మాటలు వినాలనిపిస్తుంది. వారి సన్నిధిలో మనకి హాయిగా వుంటుంది.

ప్రకృతి జడమైనది అని తెలుసు మనకు. ఈ దేహ మనో బుద్ధులు జడమైనప్పటికీ మనం జడంగా లేము. మన అనుభవాన్నిబట్టి చూస్తే మనం చైతన్యవంతులం, చురుకైన జీవులుగా వున్నాము. ఇప్పుడు మనం అందరం ఎంత చురుకుగా వున్నాం! మన మనస్సు ఆత్మ దృష్టి కలిగి ఆ వైపుకే పరుగెడుతోంది. ఈ విధంగా మనం విషయాదులను గ్రహించే ఇంద్రియాల నుండి, మనోభావాలను గ్రహించే మనస్సులోనికి, అక్కడ నుండి ఆలోచించి, వ్యవహరించే బుద్ధిలోనికి ధ్యానం మళ్ళించినప్పుడంతా జీవితంలో మనకు కలిగే అనుభవాలను విశ్లేషించి చూడటమే ఆత్మాన్వేషణ. ఈ విధంగా ఆత్మజ్ఞానం పొందే పద్ధతిని వివరించారు శ్రీమాతాజీ.

-సశేషం



# సమర్థ సద్గురు నాథుని దివ్య చరిత్ర

## శ్రీహరిరావు గారితో శ్రీబాబు

- కీ.శే. విజయేశ్వరానంద ప్రసాద్

మన వృద్ధ పండితులు చురుగ్గానే బయలుదేరారు. బోధలో వచ్చిన గోపికామతల్లుల భక్తిని, ప్రభువుతో వారి మధురానుభూతులను జ్ఞాపకం చేసుకుంటూ యింటికి చేరేసరికి గడియారం ఐదు గంటలు కొట్టింది. ఒక్కసారిగా శ్రీ బాబు అన్నమాట గుర్తుకొచ్చింది. మళ్ళీ రెండు మైళ్ళకు ఐదు గంటలు! 'శ్రీ బాబు వాక్కు బ్రహ్మ వాక్కు' అనుకున్నారు వాళ్ళిద్దరూ.



ఈ సంఘటనను వారు శ్రీ బాబుతో చెప్పినపుడు, శ్రీ బాబు "నిజమే! కాలాతీతుడైన వాని స్మరణలో మనం ఉంటే , కాలం పరుగు పెడుతున్నా, మామూలుగా అటూ యిటూ పరిగెత్తే మనస్సు ఆ స్మరణలో నిలిచిపోతుంది. అది సత్సంగ ప్రభావం" అన్నారు.

ఆర్త రక్షణ పరాయణులైన శ్రీ బాబు ఆదేశాన్ని శిరసావహించి శ్రీహరిగారు గుండుగొలను విడిచి త్వరలోనే ధర్మపత్ని తులసీదేవి గారితోను, కుమారుడు రమణ, కుమార్తెలు సుశీల, భారతి, మరదలు రాధతోను ఏలూరు వచ్చేశారు. ఒక అతి చిన్న యింటిని అద్దెకు తీసుకుని అతి నిరాడంబర జీవితాన్ని ప్రారంభించారు. ఇల్లు అతి చిన్నదే అయినా, జరుగుబాటు అతి సామాన్యమే అయినా, అతీ గతీ తానే అయిన శ్రీ బాబు పరమ దయామూర్తులై శ్రీహరిగారు ఏలూరు వచ్చిన నాటి రాత్రే వారింటికి వెళ్ళారు. శ్రీహరిగారి యిల్లు ఒక గది, ఒక చిన్న షెడ్డు మాత్రమే. అది ఒక గొప్ప యింటివారి భవంతి వెనుక, పనివాళ్ళ కోసం కట్టినది. ఆ రోజు వర్షం కురుస్తోంది. వారింటికి వెళ్ళే దోవంతా, బురదతోనూ, గడ్డి గాదరతోను చికాకుగా ఉంది. అయినా గొడుగు వేసుకుని, ఆ త్రోవలోనే నడుచుకుంటూ శ్రీ బాబు శ్రీహరిగారింటికి

మొదటి సారిగా వెళ్ళి తలుపు తట్టారు.

తలుపు తీసిన శ్రీహరిగారు దిగ్భ్రాంతులై "నను పాలింపగ నడచి వచ్చితివా! నా ప్రాణ నాథా!" అంటూ శ్రీ బాబు పాదాలపై వ్రాలిపోయారు.

శ్రీ బాబు శ్రీహరిగారి జీవిత చరిత్రనంతా సింహావలోకనం చేస్తూ, "నిన్న మొన్నటి వరకు చాలా సుఖాలు, భోగ భాగ్యాలు అనుభవించారు. ఇప్పుడవన్నీ గుర్తుకు తెచ్చుకుంటే బాధగానే ఉంటుంది. కాని భగవంతుడు అదంతా మీ మేలుకోసం చేసిందే అని గ్రహించుకోండి. ధైర్యంగా ఉండండి. జగన్మాత ఎన్నడూ మీకు, మీ కుటుంబానికీ లోటు రానివ్వదు. భక్తుల చరిత్రలు పరిశీలిస్తే, బీదవారుగా ఉంటూనే తరించిన వారెందరో ఉన్నారు. కబీరుదాసు సూర్యచంద్రులు తొంగి చూసే చిల్లుల పాకలో ఉన్నాడు. కాని ఆ సూర్య చంద్రులకే ప్రకాశమును ప్రసాదించిన పరమాత్ముని, కబీరు దంపతులు, వారి యేకైక కుమారుడు, పరమభక్తుడు అయిన కమాల్ దాస్ తమ హృదయ మందిరాలలోనే నిలుపుకున్నారు. కనుక పేదలమనే భావన వారి దరికే చేరలేక పోయింది. లక్ష్మీ నారాయణులను నమ్ముకున్న వారికి ఇహ పర దరిద్రము ఎన్నడూ కలుగదు. ఇప్పుడు మీరు యితర చింతలు మాని, నిరంతరము తనను స్మరించుకునే మహద్భాగ్యమును భగవానుడు మీకు ప్రసాదించాడు.

ఎగిరి గంతులు వేస్తూ పరుగులు తీసే చిన్న పిల్లవాడిని మీరు ఎంత ఆపినా ఆగడు. కాసేపు వాడిని వదిలివేస్తే, పరుగెత్తి అలసిపోయి, వాడే పరుగు మానేస్తాడు. తల్లి పెట్టినది తిని హాయిగా నిద్రపోతాడు. అలాగే కర్మశేషం పూర్తిగా వదిలే వరకు, విషయాదుల వెంట పరుగెత్తే మానవునికి మహాత్ముల హితబోధలు చెవికెక్కవు.

-సశేషం



విజ్ఞ  కథలు

# శ్రీ శంకర భగవత్పాదులు

(గత సంచిక తరువాయి) -రమణ ప్రసాద్

స్వప్నకాలే సత్యవద్భాతి ప్రబోధా ఉ సత్యవద్భవేత్॥

రాగద్వేషాలతో సంకులమైన ఈ సంసారం స్వప్నతుల్యమైనది. స్వప్నంలో వున్నంతవరకు సత్యంగానే కనిపిస్తుంది. మెలకువ రాగానే అంతా అసత్యమైపోతుంది.



అయితే స్వప్నావస్థ జాగ్రదావస్థలు రెండూ సమాంతరాలుగానే ఉంటాయి. మనిషికి దాహమైతే మంచినీళ్ళు తాగి దప్పిక తీర్చుకుంటాడు. స్వప్నావస్థలో మనిషి మంచినీళ్ళు త్రాగినట్లున్నా దాహం తీరదు కదా అన్న సందేహం రావచ్చు. కాని కలలో మనిషి మంచి నీళ్ళు త్రాగినంతసేపు దాహం తీరినట్లే ఉంటుంది.

జాగ్రదావస్థలో గాయం తగిలితే నిజంగా బాధ అనుభవిస్తాం. స్వప్నంలో అటువంటి బాధ ఉండదు కదా అనవచ్చు. కాని స్వప్నంలో గాయం తగిల్తే జాగ్రదావస్థలో ఎంత బాధ అనుభవిస్తాడో, స్వప్నంలో కూడ అంత బాధ అనుభవిస్తాడు.

అందుచేత జాగ్రద్ స్వప్నావస్థలకు తేడాలేదని, జాగ్రదవస్థ మేల్కొని చూసేకల (జగత్స్వప్నం) లాంటిది అని కొందరు వాదిస్తారు.

శంకరులు బాహ్య ప్రపంచం స్వప్నం లాంటిది అని అంటూనే దాని వ్యవహారిక సత్తాను అంగీకరించి బ్రహ్మజ్ఞానం లభించేవరకూ జగత్తు నిజంగానే కనిపిస్తుంది. తర్వాత దాని మిధ్యత్వం అనుభవంలోకి వస్తుంది. ఒక వ్యక్తికి జ్ఞానోదయం కాగానే ప్రపంచాన్ని మాయగా గుర్తించి ఆ మాయా ప్రభావాన్నుండి ముక్తుడవుతాడు. కాని ఇతరులకు ఈ ప్రపంచమాయ కొనసాగుతుంది అని బోధిస్తున్నారు.

వేదాంతులు సత్యానికి మూడు స్థాయీ భేదాలను ప్రతిపాదించారు – 1) ప్రాతిభాసిక సత్యం – దీనికి రజ్జుసర్పభ్రాంతి, స్వప్నదృశ్యాలు ఉదాహరణలు. చూస్తున్నంత సేపూ నిజం అన్నట్లుగా భ్రమ కలుగుతుంది. నిజం తెలియగానే భ్రమ తొలగిపోతుంది. 2) వ్యావహారిక సత్యం : జ్ఞానోదయం అవగానే ప్రపంచాన్ని మాయగా గుర్తిస్తాడు. 3)

పారమార్థిక సత్యం : ఈ స్థాయిలో బ్రహ్మమొక్కటే సత్యం. తక్కినది అంతా మిధ్య.

శంకరుల దృష్టిలో ఏది అసలైన సత్యం? ఏది పారమార్థిక సత్యం? అంటే "సర్వకాల సర్వావస్థల యందు దేనిని లేదనటానికి వీలు లేదో,దేనిని ఖండించటానికి వీలు లేదో, ఏది నిరపేక్షమో, ఏది అప్రమేయమో, ఏది స్వతంత్రమో అదే సత్యం" ఈ నిర్వచనానికి బాహ్య జగత్తు నిలవదు.ఈ నిర్వచనానికి నిలబడేది ఆత్మ ఒక్కటే. ఆత్మ అంటే నేను. అదే శుద్ధ చైతన్యం. బాల్యంలో, యౌవనంలో, వృద్ధాప్యంలో మారనిది నేను" అనే చైతన్యం ఒక్కటే. ఇది నిత్యం మన అనుభవంలోకి వచ్చే "అహంకారం" "నేను" కాదు. ఈ అహంకారం శుద్ధ చైతన్యం మీద దేహాన్ని మనస్సుని అధ్యారోపితం చేస్తుంది. అదే దేహాత్మభావం. నేను బలంగా ఉన్నాను, నేను ఆరోగ్యంగా ఉన్నాను అనే భావనలు దేహాత్మ భావం వల్లన కలుగుతోంది.

శుద్ధ చైతన్యం ఎప్పుడూ ఏ మార్పుకు లోనుకాని నిర్గుణం, నిర్వికల్పం, నిరాకారం, నిరాశ్రయం, నిరవధికం, నిత్యం అయిన కేవల సత్యం. ఇది సాక్షి మాత్రం ఇది స్వయం ప్రకాశకం. అంటే ఇది ఉన్నది అనే ఉనికిని మరొక దాని సహాయంతో తెలుసుకోనక్కర లేదు. అది దీపం లాంటిది. దీపం చూడటానికి మరొక దీపం అవసరం లేదు.

ఈ చైతన్యం ఆకాశంలో అంతటా ఉన్నది. కుండలో ఉన్న పరిమితమైన ఆకాశం కుండ పగులగానే పరిమితంలేని అనంతాకాశం అని తెలుస్తుంది. నిజానికి ఉపాధి కారణంగా భిన్నత్వం అనిపిస్తుంది. కుండ పగిలితే అంతా ఆకాశమే అలాగే జీవాత్మ పరమాత్మ విభేదం కూడ. జీవాత్మ వేరు పరమాత్మ వేరు అనుకోవటమే అవిద్య. అవిద్య తొలగిపోగానే "అహం బ్రహ్మాస్మి" అనే జ్ఞానం కలుగుతుంది. "తత్త్వమసి" – అదే నీవు అయి ఉన్నావు అనే ఉపనిషద్వాక్యానికి అర్థం.

శంకరుల అవతారానికి పూర్వం దేశంలో ఉన్న మతాలు వీరవతరించిన మీదట నామరూపాలు లేకుండా నశించాయి. ఆ కారణంగానే శ్రీ శంకరులు జగద్గురువులుగా నేటికీ కొనియాడబడుతున్నారు. ఒక ఉపాధితో కొంత కాలం దర్శించి అదృశ్యమైన ఆ అమృత స్వరూపులు. శిష్యుల భక్తుల హృదయాలలో ఎప్పటికీ జీవించే వుంటారు.

---

Printed, and Published by C.V. Ramana Babu, on behalf of YOGINI SRI CHANDRA KALI PRASADA MATHAJI CHARITABLE TRUST and Printed at Samardha Sadguru Publications, D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh, and published at D.No. 3-499, Sri Kali Gardens Ashram, Nambur - 522508, Guntur Dist., Andhra Pradesh. Editor - PALURI SIVA RAMA KALI PRASAD